

Licenced to Post without Prepayment (PMG/VJ/PWPP/17/2009-11)

స్థాపకుడు: నెల్లూరు వెంకట్రామానాయుడు స్థాపితం: 1930 జీవప్రదాత: నెల్లూరు శ్రీరామమూర్తి

Longest Living Newspaper in Telugu Journalism

ప్రజాభీమ

సంపుటి: 82 • సంచిక: 44 • 4-11-2011 శుక్రవారం • పేజీలు: 16 • విడి ప్రతి: రూ.5/-




కిరణ్ సర్కారుకు చంద్ర రక్ష!

మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి ముగ్గురు తెలంగాణ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు పార్టీకి రాజీనామా చేయడంతో శాసనసభలో కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వం మైనార్టీలో పడిపోయింది. ఒక ఎమ్మెల్యే మరణం వల్ల ప్రస్తుతం శాసనసభలో మొత్తం సభ్యుల సంఖ్య 293గా వుంది. ప్రభుత్వం నడవాలంటే కనీసం 147 మంది కావాలి. అయితే జగన్ కోసం 26 మంది, తెలంగాణ పేరుతో ఇప్పుడు ముగ్గురు రాజీనామాలు చేశారు. ఎన్నికలలో కాంగ్రెస్ గెలిచింది 156 స్థానాలలో. అందులో నుంచి వైఎస్.విజయమ్మ వెళ్లిపోయింది. చిరంజీవి నుంచి 15 మంది వచ్చి కలిశారు. ఆయన పక్కనుండిన వారిలో ముగ్గురు జగన్ పక్షం చేరారు. ఈ లెక్క ప్రకారం కాంగ్రెస్ మొత్తం బలం 170. అందులో 29 మంది రాజీనామా చేశారు కాబట్టి, కాంగ్రెస్‌కు మిగిలింది 141 మాత్రమే. ఇద్దరు స్వతంత్రులను కలుపుకొన్నా ఆ సంఖ్య 143 దాటడం లేదు. అంటే మెజార్టీ కంటే నాలుగు స్థానాలు తక్కువగా మైనార్టీలో నడుస్తున్నది ప్రభుత్వం.

ప్రతిపక్ష పార్టీ ఎవరిదైనా ఇటువంటి సువర్ణ అవకాశాన్ని వదులుకోరు. ప్రతిపక్షంలో ఇప్పుడు ఇద్దరున్నారు. మొదటివాడు చంద్రబాబు. ఆయనకు 90

కొరవ 14వ పేజీలో





ఇదేనా అభివృద్ధి?

భారత మధ్యతరగతి కుటుంబాలు ఆస్పత్రుల బిల్లుల వల్ల దారిద్ర్యరేఖ దిగువకు దిగజారి పోతున్నారని ప్రపంచ బ్యాంకు తన అధ్యయనంలో తేల్చి చెప్పింది. కార్పొరేట్ ఆస్పత్రులు తమ దగ్గరకు వచ్చే రోగుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని దోపిడీకి పాల్పడుతున్నా యని నిర్మొగమాటంగా ప్రకటించింది. నూటికి నూరు శాతం నిజం అనదగిన నివేదిక ఇది.

ఏ ప్రభుత్వమైనా పాటించవలసిన కనీస ధర్మాలలో ప్రజలకు మెరుగైన ఆరోగ్యం అందించడం ఒకటి. తిండి, నీరు, ఇల్లు, చదువు, రవాణా వసతులతో పాటుగా ఆరోగ్య పరిరక్షణకు ప్రాముఖ్యత ఇవ్వాలి. తాను ప్రజల నుంచి దండే పన్నుల రాబడిలో సింహభాగం ఇందుకోసం కేటాయించాలి. కానీ దురదృష్టవశాత్తు గత రెండు దశాబ్దాలుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆరోగ్య రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నాయి. ప్రజల ఆరోగ్యాన్ని కార్పొరేట్ ఆస్పత్రుల దయాదాక్షిణ్యాలకు వదలి వేస్తున్నాయి. ప్రభుత్వ ఆస్పత్రులను పాడు పెడుతు న్నాయి. గ్రామ స్థాయిలో పని చేయవలసిన ఆరోగ్య కార్యకర్తల వ్యవస్థను నిర్వీర్యం చేస్తు న్నాయి. పల్లెలలోని ప్రాథమిక ఆరోగ్య కేం ద్రాలలో డాక్టర్లుండరు. పట్టణాలలోని ధర్మా స్పత్రులలో డాక్టర్లున్నా మందు మాకులుండవు. ఎక్స్‌రే యం త్రాలు కూడా పని చేయవు. జబ్బు పడి వచ్చిన నిరుపేదలను భగవంతుడి దయకు వదలి వేస్తున్నారు.

మరొకప్రక్క భారతదేశంలో మూడేళ్ల లోపల పిల్లలలో 47శాతం మందికి సరైన పోషక ఆహారం లభించడం లేదు. ఆకలి రాజ్యాలైన ఆఫ్రికా ఖండం కంటే హీనస్థితిలో వుంది మన దేశం ఈ విషయంలో. కనీసం 60 లక్షల మంది పిల్లలు సరైన తిండి లేక అనారోగ్యం పాలు పడుతున్నారని అంచనా. ప్రతి ఏటా 17 లక్షల మంది పిల్లలు ఒక సంవత్సరం వయస్సు వచ్చే లోపల మరణిస్తున్నారు. కొత్తగా పుట్టే ప్రతి వెయ్యి మంది పిల్లల్లో 68 మంది మరణిస్తున్నారని ప్రభుత్వ లెక్కలు చెప్తున్నాయి. పిల్లలకు వ్యాక్సిన్లు వేయడంలో ప్రభుత్వ వైఫల్యం వల్ల కలుగుతున్న అనర్థం ఇది. డెంగ్యూ జ్వరం, హెపటైటిస్, మలేరియా, న్యూమోనియా వంటి వ్యాధులు ప్రజలను వూహిం చని సంఖ్యలో యమపురికి చేరుస్తున్నాయి. పల్లె ప్రాంతాలలో ఈ వ్యాధులకు వైద్య సదుపాయాలు లేవు. ఇప్పటికీ దేశంలో 50 శాతం మందికి పైగా పేద ప్రజలు బహిరంగ ప్రదేశాలను మరుగుదొడ్లుగా వాడుతున్నారని అంచనా. వారికి శుచి శుభ్రత కల్గిన మరుగుదొడ్లు అందుబాటులో లేవు. బహిరంగ మరుగు దొడ్ల వల్ల బ్యాక్టీరియా ఆధారిత వ్యాధులు వదల కుండా వేధిస్తున్నాయి. వీటితోపాటుగా స్వచ్ఛమైన త్రాగునీటి సమస్య పరిష్కారం కావడం లేదు.పట్టణాలలోని మురికి వాడ లలో ఈ సమస్య అధికంగా వుంది. చాలా గ్రామాలు కూడా త్రాగునీటి కొరతతో సతమతమౌతున్నాయి. దానివల్ల ఎన్నో రకాల వ్యాధులు వ్యాపిస్తున్నాయి.

కనీసం ఆస్పత్రులలోనైనా సౌకర్యాలు మెరుగుపడితే కొంతలో కొంత ప్రజల ఆరోగ్యం కాపాడవచ్చు కానీ ఆర్థిక సంస్కరణల పేరిట ఆరోగ్య రంగాన్ని సైతం ప్రైవేటు వ్యాపా రులకు వదలి చేతులు దులుపుకొన్నది ప్రభుత్వం. కార్పొరేట్ ఆస్పత్రులపై ఎటువంటి నియంత్రణ, నిఘా లేదు. దానితో వారు జనాన్ని జలగల వలె పీడిస్తున్నారు. లేని జబ్బులకు వైద్యం చేసి, వాడని మందులకు బిల్లులు వేసి, అవసరంలేని ఆపరేషన్లు జరిపించి రోగులను ఆర్థికంగా, శారీరకంగా, మాన సికంగా నాశనం చేస్తున్నాయి కార్పొరేట్ ఆస్ప త్రులు. ఆధునిక సౌకర్యాల పేరిట పట్టప గలు దోపిడీ చేస్తున్నారు. ప్రభుత్వ ఆస్పత్రు లలో సౌకర్యాలు కరవు కావడంతో దిగువ మధ్యతరగతి కుటుంబాల వారు కూడా ప్రతి ఆరోగ్య సమ స్యకూ కార్పొరేట్ ఆస్పత్రుల మీద ఆధారపడక తప్పడం లేదు. అక్కడ కట్టే బిల్లులు వారి కుటుంబాలను ఆర్థికంగా పతనం చేస్తున్నాయి. బంగారు నగలు అమ్మి, పొలాలు తాకట్టుపెట్టి, అధిక వడ్డీలకు అప్పులు చేసి ఆస్పత్రి బిల్లులు కడుతున్నారు. దానితో వారి కుటుంబాలు ఆహారపరంగా, మెరుగైన జీవన ప్రమాణాల పరంగా చాలా రాజీ పడక తప్పడం లేదు.

ఈ నిజం ప్రభుత్వంలోని పెద్దలందరికీ తెలుసు. కానీ ఇంతకాలం దానిపట్ల కనీస శ్రద్ధ పెట్టలేదు. ఇప్పుడు ప్రపంచ బ్యాంకు కూడా ఈ లోపాన్ని వేలెత్తి చూపింది. మన ప్రధాని మన్మోహన్ సింగ్‌కు అమెరికా అన్నా, ప్రపంచ బ్యాంకు అన్నా ఎక్కడలేని గురుత్వం. ఇప్పుడు వారే మన తప్పును తెలిసొ చ్చేట్లు చేశారు కాబట్టి, ప్రభుత్వ విధానాలలో మార్పు వస్తుం దని ఆశిద్దాం. కార్పొరేట్ రంగంలో ఆధునిక వైద్యవసతులు అభివృద్ధిని ఒక పక్క అనుమతిస్తూనే ప్రభుత్వపరంగా కూడా ఆస్పత్రుల నిర్వహణకు అధిక నిధులు కేటాయించడం ద్వారా ప్రజల ఆరోగ్యం కాపాడడానికి ప్రాధాన్యత ఇస్తారని ఆశిద్దాం.

జమీన్‌రైతు

జనవాక్కు

నిర్లక్ష్యం తగదు

దైవత్వానికి, సాంస్కృతిక వైభవానికి, వారసత్వ సంపదకు నిలయాలు దేవాలయాలు. ఆ ఆనవాళ్లు చెరిగిపోతున్నాయి. నిర్లక్ష్యపు చెదపట్టి అంతరించి పోతున్నాయి. రాష్ట్రంలో స్వల్ప వ్యవధిలోనే శ్రీకాళహస్తి రాజగోపురం, బాపట్ల లోని భావనారాయణస్వామి ఆలయ గాలి గోపురాలు కుప్పకూలి పోవడం బాధాకరం. శ్రీకాళహస్తి ఆలయ గోపురం కూలినప్పుడు హడావుడి చేసిన పాల కులు ఆ తర్వాత గమ్మునైపోయారు. జీర్ణావస్థలో వున్న ఆలయాలను పరిరక్షించి వాటిని పటిష్టపరుస్తామని చెప్పడమే గాని ఆ దిశగా తీసుకొంటున్న చర్యలేవో అర్థం కావడం లేదు.

పి.అరుణకుమారి నెల్లూరు

రూపాయికి కిలో బియ్యం అభినందనీయం!

తెల్ల రేషన్‌కార్డు కలిగి వున్నవారికి కిలో బియ్యం ఒక్క రూపాయికే రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వ తలపెట్టడం అభినందనీయం. కాని ఒక్కో మనిషికి నాలుగు కిలోల బియ్యం ఇవ్వడం విచారకరం. ఒక మనిషికి నెలకు 10 కిలోల బియ్యమైనా అవసరమవుతాయి. అంత ఇవ్వలేకపోయినా ఆరు కిలోలైనా ఇచ్చేటట్లు తక్షణ ఉత్తర్వులివ్వాలి. నిత్యావసర వస్తువులైన కందిపప్పు, మినపప్పు, నూనె, మిర్చి, చింతపండు కూడా తెల్లకార్డు కలిగిన వారికి సబ్సిడీ ధరపై అందించా లని విజ్ఞప్తి.

కె.వెంకటేశ్వరరావు నెల్లూరు

కుళ్లుబోతు తనం!

రాష్ట్ర ప్రభుత్వం విద్యా వాలంటీర్లకు నెలకు 12వేలు జీతం ఇవ్వాలని తలపోస్తోంది. కాని దీన్ని అప్రెంటీస్ ఉపాధ్యాయులు అడ్డుకోవడం బాధాకరం. ఉపాధ్యాయ అర్హతలున్న వారినే ప్రభుత్వం విద్యావాలంటీర్లుగా ఎంపిక చేసింది. వీరికి జీతం పెంచుతామంటే అప్రెంటీస్ ఉపాధ్యాయులు అడ్డు రావడం కేవలం కుళుబోతు తనమే.

పి.జనార్దన్ కావలి

పైసలు కాదు – పర్యావరణం కావాలి!

పిల్లా పాపలు బాగుండాలని ఈ మధ్య కొందరు పెద్దలు నానా గడ్డిమేసి ఆస్తులు, నోట్ల కట్టలు పెద్ద మొత్తంలో దాచిపెడుతున్నారు. దీని వల్ల వారసు లకు కష్టాలు తెలియక సుఖాలకు అలవాటు పడిపోతున్నారు. భవిష్యత్తు తరా నికి మంచి గాలి, నీరు కొరవడతాయి. దీని కోసం పచ్చని చెట్లను పెంచాలి. నీళ్లను పొదుపుగా వాడుకోవడం నేర్పాలి. ప్రభుత్వం ఇళ్లు, రోడ్లు, ఖాళీ స్థలాల్లో

కొరవ 14వ పేజీలో

70 ఏళ్ల క్రితం ఈవారం

7-11-1941
పేజీలు : 10 వెల: అణా

సత్యాగ్రహ వార్తలు

ఆత్మకూరు తాలుకా నావూరులో 5తేదీన చింతలపల్లి చెన్న కృష్ణయ్యగారు రెండవసారి సత్యాగ్రహ మొనరించిరి. అరెస్టు కాలేదు.

***

భోగరాజు పట్టాభి సీతారామయ్య, బులుసు సాంబమూర్తి, అయ్యదేవర కాళేశ్వరరావు, గద్దె రం గయ్య నాయుడుగారలు వేలూరి జైలు నుంచి విడుదల చేయబడిరి.

ప్రెస్టి విచారణ రిపోర్టు

నెల్లూరు దశరా గలాటాల విచారణ జరిపిన ప్రెస్టిగారు వెంటనే కోయంబత్తూరుకు పోవలసి వచ్చుటచే రిపోర్టు ఇంకా ప్రభుత్వానికి పంపలేదు.

***

23–10–1941 తేది సంతపేట మిత్రమండలి రెండవ వార్షికోత్సవం పైడా సుబ్బరామయ్యగారి యాజమాన్యమున జరిగెను. డాక్టర్ పి.రామచంద్రారెడ్డి (యంబిబిఎస్)గారు మైత్రిని గూర్చి ఉపన్యసించిరి.

బస్ ప్రమాదం

నజీరియా బస్ సర్వీస్ 2తేది మధ్యాహ్నం కలువాయి వద్ద 23 మైలులో పడిపోయి 9మందికి గాయాలు.

***

నెల్లూరు జిల్లా మహిళాసభ గూడూరులో ఈనెల 11తేదీన జరుగును. వెంకటగిరి మహారాణిగారు అధ్యక్షత వహింతురు. గుమ్మిడిదల దుర్గాబాయమ్మగారు సభ ప్రారంభము గావింతురు.

50 ఏళ్ల క్రితం ఈవారం

3-11-1961
పేజీలు: 12 వెల: 0-20 న.పై

నెల్లూరు మూడుసీట్లు ఢిల్లీలో మారకపోవచ్చు

రాష్ట్ర కాంగ్రెస్ ఎన్నికల సంఘంలోను, కాంగ్రెస్ సంఘంలోను దాదాపు రెండు వర్గాలు చీలి నాయనుకున్న బ్రహ్మానందరెడ్డి, అల్లూరి బృందాల మధ్య 50సీట్ల విషయం మినహాయిస్తే, మిగతావి దాదాపు చెరి సగంగా టిక్కెట్లు పంపిణీ జరుగుతుందని తొలిసారిగా 'జమీన్‌రైతు' వెల్లడించగలిగింది.

ఆనాడే మన రాజకీయ విలేఖరి కూపీ తీయగల్గిన విధంగానే, దాదాపు అదే లెక్కన సీట్ల పంపిణీ జరిగినట్లు ప్రకటితమైన ప్రదేశ్ కాంగ్రెస్ జాబితాను శ్రద్ధగా పరిశీలిస్తే రాజకీయజ్ఞులందరికి తేటతెల్లమౌతుంది. పేచీలో పడ్డ సీట్లు గూడా ఆనాడు మన విలేఖరి తెల్పినట్లు 50మాత్రమే వున్నాయి. వీటిలో ముఖ్యమంత్రి సంజీవయ్య అభ్యంతరం చెప్పినవి 22. వీటిలో రెండు నెల్లూరు జిల్లాకు సంబంధించినవి. ముఖ్యమంత్రి సంజీవయ్య సూచన ప్రకారం ఉదయగిరి అసెంబ్లీ సీటు షేక్ మౌలా సాహెబ్‌కు ఇవ్వాలని, సూళ్లూరుపేట సీటు శ్రీనివాసులురెడ్డికి ఇవ్వాలని వున్నది. ముఖ్యమంత్రి అభ్యంతరం తెల్పాడు కాబట్టి నేనెందుకు ఊరుకోవాలి అంటూ ఏ.సి.సుబ్బారెడ్డిగారు పేచీలు పెట్టడంతో ద్వితీయ స్థానం వహించి 13సీట్ల విషయమై ప్రత్యామ్నాయ పేర్లు సూచించారు. ఈ పదమూడింటిలోనూ స్వంత జిల్లాలో రావణాసురుని కాష్టం ఆర్పుకోకుండా వుంచుకోదలచారా అన్నట్లు సర్వేపల్లి సీటుకే ఎసరుపెట్టారు. అక్కడ వంగల్లు కోదండరామరెడ్డి గారిని తప్పించి ఆ టిక్కెట్టు హరిశ్చంద్రారెడ్డికి ఇవ్వాలని కోరారు.

యూత్ కాంగ్రెస్

పై పేరుతో వారపత్రిక ప్రచురణకు ఎల్వీ కృష్ణారెడ్డి డిక్లరేషన్ పొందారు. పత్రిక నవంబర్ ఆఖరున వెలువడుతుందట. ఈ కొత్త పేరు కంటే పాత "యువశక్తి" బాగున్నది.

నెల్లూరు ముచ్చట్లు

పార్వతమ్మలో ఆ ఆలోచన లేదట!

జగన్ సానుకూల ఆలోచన చేస్తున్నారని గతవారం 'జమీన్‌రైతు'లో తనపై వ్రాసిన వార్తను ఖండించారు మాగుంట పార్వతమ్మ గారు. తనకటువంటి ఆలోచనే లేదని విస్పష్టంగా చెప్పారు. రాజకీయంగా, కుటుంబపరంగా కొన్ని అలుకలు, అసంతృప్తుల వల్ల పార్వతమ్మ కాంగ్రెస్‌ను వదలి వెళ్లాలనే ఆలోచన చేస్తున్నారని మాకు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. ఒకటికి రెండుసార్లు విచారణ చేసుకొన్న తర్వాతనే ఆ వార్త ప్రచురించాము. అయితే పార్వతమ్మ మాత్రం దాన్ని విభేదిస్తున్నారు. స్వర్గీయ మాగుంట సుబ్బరామరెడ్డి చివరి క్షణం వరకు కాంగ్రెస్ వాదిగానే జీవితం గడిపారని, ఆయన పార్థివ దేహం మీద తానే తన చేతులతో కాంగ్రెస్ జెండా కప్పానని అందువల్ల తాను కాంగ్రెస్‌ను వదలి వెళ్లే ఆలోచన చేయనని వివరణ ఇచ్చారామె.

రోడ్లన్నీ ధ్వంసం!

ఎడతెరిపి లేకుండా నెల్లూరులో కురిసిన వర్షానికి నగరం గుండా వెళ్లే ట్రంకురోడ్డుతోపాటు ఇతర ప్రాంతాల్లోని రోడ్లన్నీ ధ్వంసమైపోయాయి. ఎమ్మెల్యే వివేకానందరెడ్డి తన వాళ్లకు ఉపాధి హామీ కల్పించను ట్రంకురోడ్డుపై పద్ధతిపాడు లేకుండా కట్టించిన డివైడర్ల మూలంగా రోడ్డుకు పడమర వైపు నుంచి వచ్చే వర్షపునీరు తూర్పువైపుకు వెళ్లే వసతిలేక నాలుగు చినుకులు పడితే చాలు రోడ్డు ఏరును తలపిస్తుంది. వేదాయపాళెం నుంచి ఫత్తేఖాన్‌పేట వరకు ఇదే పరిస్థితి. ఈ వారంలో కురిసిన వర్షాలకు ట్రంకురోడ్డుపై కట్టిన డివైడర్లను నాలుగు చోట్ల ధ్వంసంచేసి నీరుపోయే ఏర్పాటు చేశారు కాబట్టి సరిపోయిందికానీ లేకుంటే వేదాయపాళెం నుంచి జనం గాంధీబొమ్మ దగ్గరకు రాలేని దుస్థితి దాపురించేది. నగరంలోని చాలా ప్రాంతాల్లో డ్రైనేజి కట్టకుండా రోడ్లు వేయడం మూలంగా ఈ రోడ్లన్నీ వర్షానికి నుజ్జునుజ్జయ్యాయి. గాంధీబొమ్మ దగ్గర మూడు నెలల క్రితం వేసిన సిమెంట్ రోడ్డుపై సైతం వర్షపు నీరు చిరువాగులా ప్రవహించాయంటే దీన్ని ఎంత పద్ధతిగా వేశారో అర్థం చేసుకోవచ్చు. ఒక వ్యక్తి ఇష్టానుసారంగా తీసుకొన్న నిర్ణయాలను నగరంలోని అన్ని స్థాయిల అధికారులు గుడ్డిగా సమర్థించబట్టే కోట్లాది రూపాయల ప్రజాధనం బుగ్గిపాలవ్వడమే కాకుండా నగర ప్రజలు నానాపాట్లు పడవలసి వచ్చింది.

సాయంచేయలేకపోయినా పరామర్శించారు!

నెల్లూరు వర్షబాధితులను అక్టోబర్ 30, 31 తేదీల్లో కలెక్టర్ శ్రీధర్‌రెడ్డి, అదనపు జాయింట్ కలెక్టర్ లక్ష్మీకాంతం పరామర్శించారు. వీరు చొరవ తీసుకోబట్టే నాలుగు చోట్ల ట్రంకురోడ్డుపై డివైడర్లను పగులగొట్టి నీళ్లుపోయే త్రోవ చూపించారు. మాగుంట లేఅవుట్ మునగకుండా కాపాడారు. నగరంలోనే ఒక రౌండ్ తిరిగిన ఈ అధికారులు శివారు ప్రాంతాలకు వెళ్లే సాహసం చేయలేదు. జిల్లా కలెక్టర్ కూడా మాట సాయానికే పరిమితం కావడం విమర్శకు దారితీసింది.

పెన్నకు నీళ్లు!

సోమశిల రిజర్వాయర్ నుంచి పెన్నానదికి ప్రత్యేకంగా నీరు విడుదల చేయకపోయినా సంగం నుంచి నదీపరివాహక ప్రాంతమంతా మంచివర్షం పడడంతో పెన్నలో వరద నీరు చేరి అవి నెల్లూరు ఆనకట్ట వద్దకు వచ్చి అడ్డేమి లేకపోవడంతో సముద్రానికి వెళ్లిపోతున్నాయి. సోమశిల నీళ్లు వదిలినా, వరద ప్రవాహం కాస్త పెరిగినా ఇప్పటివరకు జరిగిన వారధి పనులు మళ్లీ కొట్టుక పోవడం ఖాయం. ఎన్నాళ్లీ వారధి పనులు చేస్తారో ఆ కాంట్రాక్టర్, ఆయన్ను బలపరిచే ప్రజాప్రతినిధులకే ఎరుక!

హరనాథపురం బ్రిడ్జికి పగుళ్లు!

సర్వేపల్లి కాలువపై హరనాథపురం సెంటర్‌లో కడుతున్న వంతెన అప్రోచ్ గోడలు పగుళ్లిచ్చాయి. నిర్మాణం పూర్తి కాకమునుపే ఈ దుస్థితి దాపురించిందంటే పనులెంత సుందరమైన నష్టంగా జరిగాయో అర్థం చేసుకోవచ్చు. ఈ బ్రిడ్జి కాంట్రాక్టర్ నగర ఎమ్మెల్యే శ్రీధర్‌కృష్ణారెడ్డి సోదరుని కుమారుడు. దీనివల్లే క్వాలిటీ కంట్రోల్ అధికారులు ఇవి గాలి పగుళ్లని గాలి మాటలు చెబుతున్నారు. కలెక్టర్ ఈ వ్యవహారంపై ఉన్నత స్థాయి దర్యాప్తుకు ఆదేశించాల్సిన అవసరం ఎంతైనా వుంది.

ఎస్పీ జాబితాను ప్రక్కనపెట్టిన ఐజి!

జిల్లాలో మూడేళ్లకు పైగా ఒకే స్టేషన్‌లో పనిచేస్తూ బాగా ముదిరిపోయిన ఎస్‌ఐల బదలీల విషయమై ఎస్పీ రమణకుమార్ తయారుచేసిన జాబితాను గుంటూరు రేంజ్ ఐజి హరీష్‌కుమార్ గుప్తా తీసి ప్రక్కన పెట్టినట్లు తెలిసింది. జాతీయ రహదారి వెంబడి వున్న స్టేషన్లలో పనిచేస్తూ అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న వారిపై బదలీవేటు వేయాలని ఎస్పీ భావించినా ఆ ఎస్‌ఐలు తాము సంపాదించిన అవినీతి సొమ్ములో కొంత తీసి ఈ బదలీలను ఆపుకొన్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఇక జరిగే ఎస్‌ఐ బదలీలన్నీ నామమాత్రమని చెప్పేయ వచ్చు.

ఆడవాళ్లే అధికమండీ!

జిల్లాలో ముసాయిదా ఓటర్ల జాబితాను కలెక్టరేట్ ప్రకటించింది. జిల్లాలో 18,24,643 ఓటర్లుండగా వీరిలో మహిళలు 9,28,046 మంది పురుషులు 8,96,597 మందిగా లెక్కతేల్చారు. కోవూరు నియోజకవర్గంలో అత్యధికంగా 1,99,721 మంది ఓటర్లు ఉండగా నెల్లూరు నగర నియోజకవర్గంలో అత్యల్పంగా 1,59,263 మంది ఓటర్లున్నారు. ఈ నెలాఖరు వరకు కొత్త ఓటర్లు దరఖాస్తు, పాత ఓటర్లు అడ్రస్ మార్పులు చేసుకోవచ్చు. జనవరి నెలలో తుది ఓటర్ల జాబితా ప్రచురిస్తారు.

మంత్రి టిజికి డిఇఓ విందు

రాష్ట్ర మంత్రి టి.జి.వెంకటేష్ నెల్లూరు వచ్చిన సందర్భంగా డిఇఓ రామలింగం మంత్రిగారికి విందు ఇచ్చారు. కర్నూలులో డిఇఓగా పనిచేసిన నాటి నుంచి మంత్రితో మంచి సంబంధాలున్నాయి రామలింగానికి. ఆయన ఆశీస్సులతోనే నెల్లూరు జిల్లా విద్యాశాఖాధికారిగా రాగలిగాడు. ఆ కృతజ్ఞతతో మంత్రికి అదిరిపోయే విందు ఇచ్చాడు డిఇఓ.

రోజా సవాల్

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకురాలు రోజా 29వ తేది కావలి వచ్చారు. పార్టీ కావలి ఇన్‌ఛార్జ్‌గా నియమితుడైన రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి తొలిసారిగా కావలి వచ్చిన సందర్భంగా జరిగిన సభలో పాల్గొన్న రోజా మాట్లాడుతూ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి దమ్ము, ధైర్యం ఉంటే మునిసిపాలిటీలు, స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని సవాల్ చేశారు. చంద్రబాబు వెన్నుపోటుకు బ్రాండ్ అంబాసిడర్ అని, ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి రోశయ్యకు వెన్నుపోటు పొడిచి ఆ కుర్చీలో కూర్చొన్నాడన్నారు. వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి వెన్నుపోటు రాజకీయాలు తెలియవని రోజా చెప్పుకొచ్చారు. ఈ కార్యక్రమంలో మేకపాటి సోదరులతోపాటు కాకాణి గోవర్ధన్‌రెడ్డిలు పాల్గొన్నారు.

బీద రమేష్ స్వాగతం

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం ఇన్‌ఛార్జిగా బాధ్యతలు చేపట్టి తొలిసారిగా కావలికి వచ్చిన రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డికి అల్లూరు మండల నేత బీద రమేష్ ఘన స్వాగతం పలికాడు. ఇస్కపల్లి పంచాయితీ నుంచి అధిక సంఖ్యలో కార్యకర్తలు, అభిమానులతోపాటు మేళతాళాలతో కావలికి వెళ్లి ప్రతాప్‌రెడ్డిని స్వాగతించాడు రమేష్.

బుజ్జమ్మ మరణం

యల్లాయపాళెం భూస్వామి కుటుంబీకుడు దివంగత దేవిరెడ్డి సుందరరామిరెడ్డి సతీమణి దేవి రెడ్డి బుజ్జమ్మ (80) అక్టోబర్ 29వ తేది మరణించారు. ఆమెకు నలుగురు కుమారులు, ఒక కుమార్తెలున్నారు.

వాడా వేణుగోపాల్‌రెడ్డి మరణం

ముత్తుకూరు బ్లాక్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు, ఆదర్శ రైతు వాడా వేణుగోపాల్‌రెడ్డి(78) అక్టోబర్ 28వ తేది ముత్తుకూరులో గుండెపోటుతో మరణించారు. మండలంలో వేణుగోపాల్‌రెడ్డికి ప్రజాభిమానం మెండు. ఆయన సతీ

కొరవ 14వ పేజీలో

ఆనం సోదరుల కేసు హైకోర్టుకు చేరింది

గత మునిసిపల్ ఎన్నికల సమయంలో ఆనం వెంకటరమణారెడ్డిపై ఆనం సోదరులు జరిపిన దాడి వివాదం హైకోర్టుకు చేరింది. ఎన్నికల సమయంలో పోలింగ్ బూతుల వద్ద తమకు అడ్డం వస్తున్నాడన్న కోపంతో ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి, ఆర్థిక మంత్రివర్యులు రామనారాయణరెడ్డి, వారి సోదరులు రమణారెడ్డి మీద దాడి చేశారు. చేతిలో కర్రలు పట్టుకొని వీధి రౌడీల కంటే హీనంగా వ్యవహరించారు. పోలీస్‌స్టేషన్‌లో కూడా దౌర్జన్యానికి పాల్పడ్డారు. దీనిపై రమణారెడ్డి కేసు పెట్టాడు. నెల్లూరు మేజిస్ట్రేట్ కోర్టులో ఆ కేసు విచారణకు ఒక్క రోజు కూడా వారిద్దరూ హాజరు కాలేదు. స్థానిక పోలీసులు కూడా వారికి సమన్లు ఇవ్వకుండా జాప్యం చేస్తూ వచ్చారు. దానిపై రమణారెడ్డి హైకోర్టుకు వెళ్లాడు. కేసు విచారించిన న్యాయమూర్తులు మేజిస్ట్రేట్ కోర్టులో ఆరునెలల లోపల కేసు పరిష్కారం కావాలని ఆదేశించారు. దానితో అన్నదమ్ములిద్దరూ కోర్టుకు హాజరుకాక తప్పని పరిస్థితి ఏర్పడింది. అది తమకు అవమానంగా భావించిన వారు ముఖ్యమంత్రి మీద వత్తిడి తెచ్చి అసలు కేసునే రద్దు చేస్తున్నట్లు ఒక జిఓ సృష్టించారు. అత్యవసర పరిస్థితులలో, సరైన ఆధారాలు లేని కేసుల విషయంలో ఇట్లా రద్దు ఉత్తర్వులిచ్చే అధికారం ప్రభుత్వానికి ఉంది. కానీ ఈ కేసులో వీడియో, ఫోటో ఆధారాలతో సహా వందల మంది జనం సాక్ష్యం ఉంది. అటువంటి కేసును అధికార దుర్వినియోగంతో రద్దు చేయడం అక్రమమని ఆరోపిస్తూ ఆనం రమణారెడ్డి మరొకసారి హైకోర్టుకు వెళ్లాడు. ఆ కేసు ప్రస్తుతం విచారణ జరుగుతున్నది. ప్రభుత్వం ఏ కారణంతో ఈ కేసులను రద్దు చేసిందో వివరణ ఇవ్వాలని ప్రభుత్వ న్యాయవాదులను, పోలీస్ అధికారులను ఆదేశించారు హైకోర్టు న్యాయమూర్తులు. అధికారాన్ని అడ్డం పెట్టుకొని తమ దౌర్జన్యాలను చట్టం పరిధి నుంచి తప్పించడానికి మంత్రివర్యులు చేస్తున్న ప్రయత్నాన్ని న్యాయస్థానాలు నిరోధిస్తాయనే ఆశిద్దాం.

చందాదారులకు మనవి

- **చందా పంపించేటప్పుడు తమ చందా నెంబరు, పూర్తి పేరు, చిరునామా తెలియపరచండి.**
- **మీ చందా నెంబరు, చందా ఏ తేదికి అయిపోతుందో, అడ్రసు రేపరు మీదనే ముద్రించి వుంటుంది.**
- **'జమీన్‌రైతు' చందాదార్లు తమ చందాను ఎం.ఓ/డి.డి లేదా Online‌లో ఆంధ్రాబ్యాంక్, విఆర్‌కాలేజి బ్రాంచి, నెల్లూరు అకౌంట్ నెంబర్: 1068110110004 23లో ZAMINRYOT పేరుతో జమచేయవచ్చు. సకాలంలో చందా చెల్లించవలసినదిగా కోరుతున్నాము.**
- **చెక్కులు స్వీకరించబడవు.**

జీవిత చందా రూ.1000/-

సంవత్సర చందా

స్వదేశంలో రూ.200/-

విదేశాలకు రూ.1000/-

జమీన్‌రైతు

పొగతోట, నెల్లూరు - 524 001

ఫోన్: 0861 - 2327354

సెల్: 98489 66190

వెండి స్పెషల్ ఆఫర్

925 STERLING SILVER (EXPORT QUALITY)

ఆంధ్రాలోనే మెగా వెండి షోరూం

సిల్వర్ ప్లాజా

EXCLUSIVE SILVER SHOW ROOM

AUnit of GOLD PALACE

హోటల్ శివం ఎదురుగా, జిల్లాపరిషత్ ఆఫీసు సెంటర్ ఆచారివీధి, నెల్లూరు. ఫోన్ : 2331132, 2331121

వజ్రం - బంగారం - వెండి స్పెషల్ ఆఫర్

BIS 916 హాల్‌మార్క్ బంగారు ఆభరణములపై సవరకు రూ.400/- తగ్గింపు

గ్రాముకు రూ. 50/- తగ్గింపు

డైమండ్స్‌పై 10% తగ్గింపు

గోల్డ్ ప్యాలెస్

హోటల్ శివం ఎదురుగా, జిల్లాపరిషత్ ఆఫీసు సెంటర్,ఆచారివీధి, నెల్లూరు. ఫోన్ : 2331133, 2327611

వర్షంతో రైతుల హర్షం

మొదలైన వ్యవసాయ పనులు



నారు వేతలో గ్రామీణ మహిళలు.

ఈశాన్య రుతుపవనం నెల్లూరు రైతులను వంచించ లేదు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ఈశాన్య రుతుపవనానికి ఊతంగా నిలవడంతో 24వ తేది చినుకులు మొదలై 31వ తేది వరకు వర్షం పడుతూనే ఉండడంతో ఈ యేడు రైతులు వ్యవసాయ పనులు ఢోకా లేకుండా చేసుకొనే అవకాశం దొరికింది. వర్షం మొదలైన రోజుకే సోమశిల జలాలు డెల్టా రైతుకు అంది వ్యవసాయ పనులు మొదలు పెట్టారు. ప్రస్తుతం పడిన వర్షం మూలంగా మెట్ట ప్రాంతాలైన విజమూరు, ఉదయగిరి, వెంకటగిరి తోపాటు సూళ్లూరుపేట రైతులు దర్జాగా వ్యవసాయం చేసుకొనే పరిస్థితి నెలకొంది. సోమశిల నీటికి వర్షం తోడవ్వడంతో కావలి, జలదంకి, కడనూతల, రామన్న చెరువు, అల్లూరు చెరువులు పూర్తిగా నిండిపోయాయి. కనిగిరి రిజర్వాయర్ నుంచి నీళ్లు వదులుతుండడంతో మలిదేవి, పైడేరు కాల్వలు కూడా ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఇప్పటికే మెట్ట ప్రాంతంలో వేసి వున్న మినుముకు ఈ వర్షం అదునుగా నిలవగా, ఆలస్యంగా వరివేసిన కలువాయి రైతులకు మాత్రం దెబ్బ కొట్టింది. మెట్టలో కంది, పొగాకు సాగుకు వర్షం అందదండలందిస్తుంది. డెల్టా ప్రాంతాలైన బుచ్చి, కోవూరు, అల్లూరు, సర్వేపల్లి, విడవలూరు, కొడవలూరులలో వర్షంతో రైతులు ఉత్సాహంగా వ్యవసాయ పనులు మొదలుపెట్టారు. అక్టోబర్ నెలలో కురవాల్సిన సగటు వర్షపాతం 208 మిల్లీ మీటర్లు నెల చివరి మూడు రోజుల్లో కురవడం విశేషంగా చెప్పుకోవచ్చు.

నగర జీవనం అస్తవ్యస్తం!

● వర్షం మూలంగా వచ్చే ఇబ్బందులపై పాఠాలు నేర్వరా?



మాగుంట లేఅవుట్‌లో నీటితో నిండిన రైల్వే అండర్ బ్రిడ్జి.

గాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి కారణంగా గత వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు నెల్లూరు నగరంలో జనజీవనం అస్తవ్యస్తం అయ్యింది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వలన రోడ్లపైకి నీరు చేరడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. నగరంలోని నిప్పో, వేదాయపాళెం, తదితర ప్రాంతాలలో కట్టిన డివైడర్ల కారణంగా తూర్పు ప్రాంతం నుంచి నీరు పడమర వైపు వచ్చేందుకు ఆటంకం ఏర్పడి రోడ్డుపై పెద్ద ఎత్తున నీరు చేరడంతో రాకపోకలకు ప్రజలు పడిన బాధలు వర్ణనాతీతం. ముఖ్యంగా వాహనాలపై వెళ్లేవాళ్లు నీళ్లలో వాహనాలు నిలచిపోవడంతోపాటు ఎక్కడ గుంటలు వున్నాయో తెలియక ప్రమాదాలకు గురయ్యారు. ఇక అండర్ బ్రిడ్జిల సంగతి చెప్పనవసరం లేదు. ఎప్పటిలాగే ఆత్మకూరు బస్టాండు, మాగుంట లేఅవుట్, హరనాధపురం అండర్ బ్రిడ్జిల్లోకి నీరు చేరడంతో బస్సులు నీట మునిగాయి. విజయమహల్ బాక్స్ టైప్ బ్రిడ్జి వద్ద నీరుపోయే మార్గంలేక తీవ్రమైన ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తాయి. వర్షపు నీరు పోయేందుకు అధికారులు, పాలకులు ముందుచూపుతో వ్యవహరించకుండా నిర్లక్ష్యం వహించడంతో వర్షాలు కురిసిన ప్రతిసారి నగరంలో ఈ సమస్య తలెత్తుతున్నా శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టకపోవడంతో ఎక్కడికక్కడ నీళ్లు నిలచిపోయి చెరువులను తలపిస్తున్నాయి. లోతట్టు ప్రాంతాలైన జనార్దన్‌రెడ్డి కాలనీ, మన్సూర్‌నగర్, డ్రైవర్స్ కాలనీ, గాంధీజన సంఘం, టైలర్స్ కాలనీ, తల్పగిరికాలనీ, జనశక్తి నగర్, సుందరయ్యకాలనీ, పడారుపల్లి, ఉమ్మారెడ్డిగుంట, అనగుంట, తదితర ప్రాంతాలలో వర్షపునీరు ఇళ్లలోకి ప్రవహించడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

చేపలమార్కెట్‌లో ఆగని అక్రమాలు!

● నిలువు దోపిడీకి గురౌతున్న ప్రజలు



మామూలు తక్కెడతో దర్జాగా చేపలు తూస్తున్న విక్రేత.

నెల్లూరు డైకస్ రోడ్డులో ఆత్యాధునికంగా నిర్మించామని చెప్పుకొంటున్న చేపల మార్కెట్‌లో అక్రమాలు, అన్యాయాలు ఏమాత్రం ఆగలేదు. ఇటీవల వరకు మార్కెట్‌లోని అరుగుపై కూర్చొని వ్యాపారాలు చేసే వ్యక్తులు ఎత్తుగా నిర్మించిన ప్లాట్‌ఫారాలపై వ్యాపారాలు చేయడం మినహా మార్కెట్‌లో తూకం దోపిడీ ఏమాత్రం ఆగలేదు. మార్కెట్‌లో గతంలో వ్యాపారాలు చేసుకొనే కొంత మందికి ఈ మార్కెట్‌లో షాపులు కేటాయించలేదు. దీంతో మార్కెట్‌లో ప్రతినిత్యం ఏదో ఒక గలాటా జరుగుతూనే ఉంటుంది. అధికారికంగా మార్కెట్‌లో సిపిఎం నేతృత్వంలోని మత్స్యకార మహిళా కార్మిక సంఘం ప్రాతినిధ్యం వహిస్తున్నా పెత్తనమంతా మార్కెట్ నాగేశ్వరరావుదే. మార్కెట్‌లో పాత తక్కెడల ద్వారా చేపలు, రొయ్యలు తూచి ఇచ్చేవారు. చేపలమ్మే వారి హస్తలాఘవం వల్ల కిలో కొంటే 700 గ్రాములు వచ్చేవి. ప్రస్తుతం ఎలక్ట్రానిక్ తక్కెడలు కొన్ని దుకాణాల్లో పెట్టినా అవి సైతం కిలోకు 700 గ్రాములు తూస్తున్నా పట్టించుకొనే వారేలేరు. ఎలక్ట్రానిక్ తక్కెడలు కొనుగోలు, కార్పొరేషన్‌కు పన్నులు చెల్లించాలంటూ చేపలను కిలో పది రూపాయలు పెంచి అమ్ముతున్నారు. దేశంలో పేరుగాంచిన ఈ మార్కెట్‌లో చెడిపోయిన చేపలు అమ్ముతున్నా మునిసిపల్ ఆరోగ్య శాఖాధికారుల్లో చలనం లేదు. మార్కెట్‌లో చేపలమ్మే వారిది ఒక దౌర్జన్యమైతే శుభ్రపరిచే వాళ్లు మరీ రెచ్చిపోతున్నారు. విచిత్రంగా అరవమూక ఈ పనిలో ఎక్కువగా వుంది. గతంలో చేపలు శుభ్రపరచను కిలోకు 10 రూపాయలు తీసుకొనేవారు ఇప్పుడు 20 రూపాయలుగా పెంచేశారు. చిన్న చేపలకు ముప్పై రూపాయలు అడుగుతున్నారు. ఈ రేటుకు ఒక్కోసారి పక్కెలు, జల్లల వంటి చిన్న చేపలు కిలో వచ్చేస్తాయి. శుభ్రత కూడా మార్కెట్‌లో మెరుగుపడలేదు. ముక్కు పుటాలదిరే గబ్బును భరించడం చాలా కష్టం. మార్కెట్‌లో చేపలమ్మే, శుభ్రపరిచే వాళ్లకు కార్పొరేషన్ అధికారులే చొరవ తీసుకొని కౌన్సిలింగ్ చేయించాల్సిన పరిస్థితి ప్రస్తుతం చేపల మార్కెట్‌లో వుంది.

ట్రామా కేర్ సెంటర్‌కు స్వస్థత చేకూరేనా?



పెద్దాసుపత్రిలో పేరుకే ఈ ట్రామాకేర్ సెంటర్.

రోడ్డు ప్రమాదాలు జరిగిన సందర్భంలో సత్వర చికిత్స అందక పలువురు ప్రాణాలు కోల్పోతున్నారు. దీనిని దృష్టిలో వుంచుకొని రోడ్డు ప్రమాద బాధితులకు తక్షణ వైద్యం అందించాలన్న ఉద్దేశ్యంతో పెద్దాసుపత్రిలో ప్రత్యేకంగా ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటు చేశారు. అధికారులు, వైద్యుల నిర్లక్ష్యం కారణంగా ఈ సెంటర్ నామమాత్రం అవుతోంది తప్ప వైద్య సేవలు అందించడం లేదు. పాలకులు, అధికారులు ట్రామా కేర్ సెంటర్‌ను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తెస్తామని గత కొన్నేళ్లుగా ప్రకటించడం తప్ప కార్యరూపం దాల్చకపోవడంతో అత్యవసర వైద్యం అందడం లేదు. 2007 సంవత్సరం జనవరి 22న ఆనాడు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రిగా వున్న పనబాక లక్ష్మి పెద్దాసుపత్రి ప్రాంగణంలో ట్రామాకేర్ సెంటర్‌ను ప్రారంభించారు. అందుకోసం 5.1 కోట్ల రూపాయలు మంజూరయ్యాయి. వైద్య పరికరాలు కొనుగోలు చేసినప్పటికీ అవసరమైన వైద్యులు, సిబ్బంది లేకపోవడంతో మొక్కుబడిగా వైద్యం అందుతుంది తప్ప పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాలేదు. ముఖ్యంగా రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారికి అత్యవసర, మెరుగైన చికిత్స అందించాలంటే వైద్య నిపుణులు ఉండాలి. నరాలు, గుండె సంబంధిత వైద్యులు ఎప్పుడూ అందుబాటులో ఉండాలి. ఈ సెంటర్ ప్రారంభమై నాలుగేళ్లు అవుతున్నా ఈ వైద్య నిపుణులు లేరు. అత్యాధునిక పరికరాలైన స్కానింగ్, సిటీ స్కానింగ్ పరికరాలు ఉన్నప్పటికీ రేడియాలజిస్ట్, టెక్నీషియన్లు, నర్సులు తదితర వైద్య సిబ్బంది నియామకాలు పూర్తిస్థాయిలో జరగకపోవడంతో 24 గంటలు అందుబాటులో వుండాల్సిన ట్రామా కేర్ సెంటర్ ఉపయోగపడకుండా పోతోంది.

● రెండు రోజుల

ముందే ప్రారంభమైన పథకం!

మన రేషన్ డీలర్లు సామాన్యులు కారు!

రూపాయికే కిలో బియ్యం పథకం ఈ నెల ఒకటి నుంచి అమలు చేయడంతో రెండు రోజుల క్రితం నుంచే రేషన్ షాపులవద్ద క్యూ కట్టారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ పథకం 1న అమలు కావడంతో ముందుగానే రేషన్‌షాపు డీలర్లు బియ్యం దిగుమతి చేసుకోవడం జరిగింది. అక్టోబర్ 30వ తేది నుంచే అల్లూరు, కొడవలూరు, విడవలూరు మండలాల్లోని కొన్ని రేషన్ షాపుల్లో బియ్యం పంపిణీ చేసేశారు. పథకం ప్రారంభం రోజున అధిక సంఖ్యలో లబ్దిదారులు బియ్యం తీసుకెళ్లేందుకు వస్తే రద్దీగా వుంటుందన్న ఉద్దేశంతో ముందుగానే రూపాయికే కిలో బియ్యాన్ని పంపిణీ చేసినట్లు తెలుస్తుంది. రేషన్ షాపు డీలర్లు ముందుగానే బియ్యం పంపిణీ విషయం అధికారులకు తెలియకుండా జాగ్రత్త పడ్డారు. జిల్లావ్యాప్తంగా ఒకే రోజు ప్రారంభం కావాల్సిన ఈ పథకం రెండు రోజుల ముందుగా ప్రారంభం కావడం విశేషం.

లక్ష్యాన్ని చేరుకోను

రిజిస్ట్రేషన్ శాఖ పాట్లు!

2011-12 ఆర్థిక సంవత్సరంలో 200కోట్ల రూపాయల మేర రిజిస్ట్రేషన్ శాఖ ఆర్జించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టడంతో కార్యాలయానికి వచ్చే కక్షిదారులు, వారి భూముల వివరాలను సమగ్రంగా పరిశీలించకుండానే రిజిస్ట్రేషన్లు చేసి పారేస్తున్నారు.



నెల్లూరులోని రిజిస్ట్రేషన్ శాఖ కార్యాలయం.

రాష్ట్రప్రభుత్వం రిజిస్ట్రేషన్‌శాఖకు నిర్ణయించిన లక్ష్యాన్ని సాధించేందుకు ఆ శాఖ అధికారులు నానాతంటాలు పడుతున్నారు. నెల్లూరు నగరంతో పాటు వివిధ ప్రాంతాల్లో వున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు రాష్ట్రప్రభుత్వం ప్రతి సంవత్సరం లక్ష్యాన్ని నిర్ణయిస్తుంది. 2011–12 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి దాదాపు 200 కోట్లకుపైగా ఆదాయం సమకూర్చాలన్న లక్ష్యంగా పెట్టుకున్నారు. దీంతో ఆశాఖ అధికారులు కార్యాలయానికి వచ్చిన కక్షిదారుల వివరాలు, భూముల వివరాలను సమగ్రంగా పరిశీలించకుండానే ఆదాయం కోసం రిజిస్ట్రేషన్ చేసేస్తున్నారు. ఒకరిపేరుతో ప్రభుత్వం పట్టా జారీ చేస్తే మరొకరి పేరుతో రిజిస్ట్రేషన్ జరిగిపోతుంది.

భూములు, నివేశన స్థలాలు అసలు యజమానులకు తెలియకుండానే మరొకరి పేరున రిజిస్టర్ అవుతుండడంతో లబోదిబోమంటున్నారు. జిల్లా కలెక్టర్ స్పందించి చర్యలు తీసుకుంటే తప్ప రిజిస్ట్రేషన్‌లు రద్దు కావడం లేదు. వివాదాస్పద రిజిస్ట్రేషన్‌ల గురించి ఆశాఖ అధికారులు ఏమాత్రం స్పందించకపోవడంతో కోర్టుల చుట్టూ తిరగాల్సి వస్తుంది. ప్రభుత్వం నిర్ణయించిన లక్ష్యాన్ని అధిగమించాలన్న ఆలోచనతో ప్రభుత్వ భూములు, బలహీనవర్గాల వారికి కేటాయించిన ఇళ్ల స్థలాలు రిజిస్ట్రేషన్ అవుతున్నాయి. ఇటీవల నెల్లూరు నగరంలో ఇంటి నివేశన స్థలాలకు డిమాండ్ ఏర్పడింది. ఎక్కడ ఖాళీస్థలం కనిపించినా రాజకీయ పలుకుబడి కలిగినవారు ఆక్రమించి రాత్రికి రాత్రే నిర్మాణాలు చేపడుతున్నారు. అనంతరం ఏదో ఒక పేరుతో నకిలీ దస్తా వేజులను సృష్టించి విక్రయాలు జరిపి కోట్లు సంపాదిస్తున్నారు.

రియల్‌ఎస్టేట్ వ్యాపారులు సృష్టిస్తున్న నకిలీ దస్తావేజులను రిజిస్ట్రేషన్‌శాఖ అధికారులు సమగ్రంగా పరిశీలించకుండానే పనులు పూర్తి చేస్తున్నారు. ఇందుకు డాక్యుమెంట్ రైటర్లు బాగా సహకరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. గత రెండు నెలల నుంచి రియల్‌ఎస్టేట్ వ్యాపారం కొంతమేర తగ్గుముఖం పట్టింది. దీంతో రిజిస్ట్రేషన్‌లు ఆశించిన మేర జరగడం లేదు. ఒక ప్రక్క రిజిస్ట్రేషన్‌లు జరగకపోవడం, మరోప్రక్క ప్రభుత్వం విధించిన లక్ష్యాన్ని సాధించాల్సి రావడంతో జిల్లాలోని అన్ని రిజిస్ట్రేషన్ అధికారులు ఆదాయ మార్గాల కోసం అన్వేషిస్తున్నారు. మరో నాలుగు నెలల ఆర్థిక సంవత్సరం గడువు వుండడంతో ఎలాగైనా లక్ష్యాన్ని పూర్తి చేయాలన్న ఆలోచనలో పడ్డారు. ఆదాయం సమకూర్చాలన్న ఏకైక లక్ష్యంతో పోరంబోకు స్థలాలను సైతం రిజిస్ట్రేషన్ చేసేందుకు సిద్ధమవుతున్నారు.

నెల్లూరు నగరంలోని జిల్లా జైలు సమీపంలో నీటి పారుదలశాఖకు చెందిన స్థలంలో లక్ష్మమ్మ అనే మహిళా దాదాపు పాతికేళ్ల నుంచి ఇల్లు నిర్మించుకుని నివాసం వుంటుంది. ఈమె పేరుతోనే విద్యుత్ సర్వీస్, ఇంటి పన్ను చెల్లిస్తుంది. ఇటీవల మరొక వ్యక్తి ఆ స్థలం తనదంటూ, వెంటనే ఇల్లు ఖాళీ చేయాలని బెదిరించాడు. ఎన్నో సంవత్సరాల నుంచి ఇక్కడే నివాసం వుంటున్న తనను ఇల్లు ఖాళీ చేయాలని బెదిరించడంతో ఆమె అవాక్కైంది. రెవెన్యూ అధికారులు జారీ చేసిన ఇంటి పట్టా చూపించినప్పటికీ తమ పేరున ఇంటి స్థలం రిజిస్ట్రేషన్ జరిగినట్లు దస్తావేజులు చూపారు. దీంతో అసలు యజమానురాలు కోర్టును ఆశ్రయించాల్సి వచ్చింది. ఈ సంఘటన కేవలం ఉదాహరణ మాత్రమే. ఇటువంటివి వెలుగులోకి రానివి జిల్లాలో అనేకం వున్నాయి. కేవలం ఆదాయాన్ని దృష్టిలో వుంచుకొని రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు.

ప్రభుత్వం నిర్ణయించిన లక్ష్యాన్ని సాధించకపోతే ఉన్నతాధికారుల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుంది. లక్ష్యాన్ని సాధిస్తే అభినందనలు, రివార్డులు అందుతుంటాయి. అంతే కాకుండా అధికారులకు కూడా మామూళ్లు భారీగానే అందుతాయి. ఇప్పటికే జిల్లాకు కేటాయించిన లక్ష్యంలో యాభైశాతం సాధించినట్లు సమాచారం. మిగిలిన యాభై శాతాన్ని ఆర్థిక సంవత్సరం గడువు ముగిసేలోగా ఏదోఒక విధంగా పూర్తి చేయాలన్న లక్ష్యంతో వున్నారు. ఇందుకు డాక్యుమెంట్ రైటర్ల సహకారం తీసుకుంటున్నారు. ఏది ఏమైతేనేం అక్రమ రిజిస్ట్రేషన్లు జరగకుండా చూడాల్సిన బాధ్యత ఆశాఖ ఉన్నతాధికారులపై వుంది.

గ్రామాల్లో కాదు

ఇక మండల కేంద్రాల్లో "రచ్చబండ"

"రెండవ విడత రచ్చబండ కార్యక్రమం జిల్లాలో ప్రస్తుతం జరుగుతున్నది. మొదటి విడతలో జరిగిన ఈ కార్యక్రమంలో స్వీకరించిన విజ్ఞప్తులను ఇంకా పరిష్కరించ లేకపోవడంతో అధికారులు గ్రామాలకు వెళ్లలేక ఈసారి మండల కేంద్రాలలో దీన్ని ఏర్పాటు చేశారు."

రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 2వ తేది నుంచి రచ్చబండ కార్యక్రమం ప్రారంభమైంది. ముఖ్యమంత్రిగా కిరణ్ కుమార్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత గత ఫిబ్రవరి నెలలో రచ్చబండ కార్యక్రమం జరిగింది. 2వ విడత రచ్చబండ కార్యక్రమాన్ని నవంబర్ 2 నుంచి నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమం దాదాపు 15 రోజులపాటు జిల్లావ్యాప్తంగా జరగనుంది. రచ్చబండ కార్యక్రమం వుద్దేశం బాగానే వున్నా అమలు కొచ్చే సరికి అనేక ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ప్రధానంగా రేషన్ కార్డుల జారీ, భూపంపిణీ, సంక్షేమ పథకాలకు లబ్దిదారుల ఎంపిక, వికలాంగులు, వృద్ధాప్య పెన్షన్ల మంజూరుకు అధిక సంఖ్యలో ప్రజల నుంచి దరఖాస్తులందుతున్నాయి. ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించిన అధికారులు ఫైళ్లలో భద్రపరుస్తున్నారే తప్ప పరిష్కరించడం లేదు. ప్రతి సమస్య పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆమోదం లభించాల్సి వుంటుంది. ప్రతి దానిని కంప్యూటరీకరణ చేసి ఆన్‌లైన్‌లో వుంచడం వల్ల జిల్లా, మండల స్థాయి అధికారులు ఏమీ చేయలేని పరిస్థితి నెలకొనింది. ఆన్‌లైన్ విధానం అమల్లో లేన్నప్పుడు మండల తహసీల్దార్ నేరుగా రేషన్ కార్డు మంజూరు చేసే అధికారం కలిగి వుండేవారు. ప్రస్తుతం బియ్యం, కిరోసిన్ కూపన్లు కూడా అందించే అవకాశం లేదు. ప్రభుత్వం నుంచి ఆమోదం లభిస్తేనే ఏ పనైనా చేయగలుగుతున్నారు. ఈ విధానం గ్రామీణ ప్రాంత ప్రజలకు తెలియకపోవడం వల్ల కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోంది.

గత ఫిబ్రవరిలో నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో రేషన్‌కార్డులు, పెన్షన్లు, ఇందిరమ్మ గృహాల మంజూరుకు ఎక్కువ సంఖ్యలో దరఖాస్తులందాయి. ఎనిమిది నెలలు కావస్తున్నా అప్పుడు స్వీకరించిన వినతి పత్రాలకు నేటికీ మోక్షం లభించలేదు. గతంలో రేషన్‌కార్డు కలిగి వున్నవారిని సర్వే పేరుతో అనర్హులుగా గుర్తించి రద్దు చేయడం జరిగింది. అవగాహన లేని సిబ్బంది చేత ఇంటింటా సర్వే చేయించడం ఇందుకు కారణం. గ్రామాల్లో నివాసం వున్న వారిని లేనివారిగా నిర్ధారించడం, తెల్ల రేషన్‌కార్డు కలిగిన వారిని ధనవంతులుగా నమోదు చేయడం వంటి పొరపాట్లు జరిగాయి. వున్న రేషన్ కార్డులు రద్దు చేయడంతో తిరిగి వాటిని పునరుద్దరించాలని గత రచ్చబండ కార్యక్రమంలో వినతి పత్రాలు సమర్పించారు. అదిగో ఇదిగో అంటూ ఎనిమిది నెలలు గడిచిపోయినా రేషన్‌కార్డు రద్దు చేసిన వారికి నేటికీ పునరుద్దరణ జరగ లేదు. కొందరికి మాత్రం కూపన్లు అందించగా, కూపన్ల కొరత కారణంగా మరికొందరికి వీటిని అందించ లేకపోయారు. వృద్ధాప్య పెన్షన్ల మంజూరు పరిస్థితి ఇలాగే తయారైంది. అర్హులైన వారి నుంచి దరఖాస్తులు స్వీకరించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినా పెండింగ్‌లోనే వున్నాయి. ప్రస్తుతం జరిగే రచ్చబండ కార్యక్రమంలో స్వీకరించిన వినతి పత్రాలకు ఎప్పుడు మోక్షం లభిస్తుందో వేచి చూడాలి. గత రచ్చబండ కార్యక్రమం గ్రామ పంచాయితీ పరిధిలో నిర్వహించగా ప్రస్తుతం రచ్చబండను మండల స్థాయిలో నిర్వహించే విధంగా ప్రభుత్వం నిర్ణయించింది.

వివిధ కార్యక్రమాల పేరుతో గ్రామాలకు వెళితే ప్రజల నుంచి నిరసనలు వ్యక్తం అవుతున్నాయి. దీంతో అధికారులు కొంత వెనుకంజ వేసిన సందర్భాలున్నాయి. వివిధ సమస్యలపై గ్రామాలకు వెళ్లిన అధికారులను నిలదీసి ప్రశ్నిస్తుండడంతో సరైన సమాధానం చెప్పలేక ఏదో ఒక విధంగా బయటపడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో ఈ దఫా మండల కేంద్రాల్లోనే రచ్చబండ నిర్వహించే విధంగా ఉత్తర్వులు జారీ అయ్యాయి. అయినా ప్రజా ప్రతినిధులు, అధికారులు ప్రజల నుంచి నిరసనలు ఎదుర్కోక తప్పదు.



సినీనటుడు నాగబాబు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని కేక్ కట్ చేస్తున్న నగర ఎమ్మెల్యే శ్రీధరకృష్ణారెడ్డి. ప్రక్కన కృష్ణారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, ముక్కాల ద్వారకనాథ్, రవి తదితరులు.



కావలి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్‌గా నియమితుడైన రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి తొలిసారిగా కావలి వచ్చిన సందర్భంగా ఏర్పాటైన సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జూపూడి ప్రభాకర్‌రావు. చిత్రంలో ప్రజలకు అభివాదం చేస్తున్న రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి.



నెల్లూరులోని మురళీ ఆర్ట్స్ నిర్మిస్తున్న అమరజీవి టెలీఫిల్మ్‌కు క్లాప్‌నిస్తున్న జిల్లా కలెక్టర్ శ్రీధర్‌రెడ్డి.

మరమ్మత్తులకు నోచుకోని చెరువులు

వెంకటగిరి మండలంలోని పలు చెరువులు మరమ్మత్తులకు నోచుకోకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు పడుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో తమ పరిస్థితి ఏమిటన్న సందిగ్ధంలో వున్నారు రైతులు. మండలంలోని పాళెంకోట చెరువుకట్టలు కరిగి ప్రమాదకరంగా మారి వున్నాయి. పాపమాంబాపురం చెరువుకు గండిపడి చుక్కనీరు నిలవని పరిస్థితి, వల్లివేడు నాయుడు చెరువు

వెంకటగిరి రైతులకు ఎన్ని కష్టాలు!

తూముకు గండిపడి ఏడాది అయినా ఇంతవరకు మరమ్మత్తులు చేపట్టిన దాఖలాలు లేవు. ఏళ్ల తరబడి మరమ్మత్తులు చేపట్టకపోవడంతో చెరువుల్లో చుక్కనీరు నిలవడం లేదు. అధికారులు ప్రతిపాదనలు పంపామని చెప్పడం తప్ప వీటిపట్ల శ్రద్ధ వహించకపోవడంతో చెరువులు ప్రమాదకర స్థితిలో చేరుకొని వున్నాయి.

ఆక్రమణల చెర చిక్కిన గూడూరు చెరువు!

300 ఎకరాలు దురాక్రమణ

వందలాది ఎకరాలకు సాగునీరు అందిస్తున్న గూడూరు చెరువు ఆక్రమణల చెరచిక్కిపోతోంది. ఈ చెరువు విస్తీర్ణం 800ఎకరాలు. దాదాపు 2వేల ఎకరాలు చెరువు క్రింద సాగుచేస్తున్నారు రైతాంగం. చెరువుపై ఆక్రమణదారుల కన్నుపడడంతో కాలక్రమేణా చెరువు విస్తీర్ణం కుచించుకపోతోంది. ఇప్పటికే 300ఎకరాలకు పైగా ఆక్రమించేశారు. దీంతో ఆయకట్టు క్రింద సాగు చేస్తున్న రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. చివరకు పంటకాలువలను సైతం ఆక్రమించేస్తున్నారు. గతంలో సబ్‌కలెక్టర్‌గా ప్రద్యుమ్న పని చేసిన కాలంలో చెరువు ఆక్రమణలను తొలగించి, భవిష్యత్తులో ఆక్రమణకు ఆస్కారం లేకుండా చేశారు. ఆయన బదలీ తర్వాత తిరిగి ఆక్రమణదారులు నేతల అండదండలతో చెరువు ఆక్రమణకు పూనుకొంటున్నారు. ఆక్రమణకు పాల్పడడమే కాకుండా ఆ స్థలంలో శాశ్వత కట్టడాలు నిర్మించారు. గూడూరు ఆయకట్టు



ఆక్రమణలకు గురైన గూడూరు చెరువు.

రైతులు చెరువు ఆక్రమణలపై రెవెన్యూ అధికారులను కలసి విన్నవించినప్పటికీ ఫలితం లేకుండాపోతోంది. మరోవైపు ఆక్రమణదారులు ఆ స్థలాలకు పట్టాలు కూడా సృష్టించేశారట. ఈ వ్యవహారంపై కొత్తగా గూడూరు సబ్‌కలెక్టర్‌గా వచ్చి ప్రజా సమస్యలపై స్పందిస్తున్న వీరపాండ్యన్ దృష్టిసారించి ఆక్రమణలను అరికట్టి చెరువును కాపాడాల్సి వుంది.

ఉదయగిరిలో విష జ్వరాలు!

పారిశుద్ధ్యం పాతరేసింది

ఉదయగిరి నియోజకవర్గంలో విషజ్వరాలు ప్రజలను అతలాకుతలం చేస్తున్నాయి. పలు మండలాల్లో ప్రజలు వీటిబారినపడి మంచం పడుతున్నారు. ఉదయగిరి మండలంలో ఈ జ్వరాల బారిన పడినవారి సంఖ్య అధికంగా వుంది. గండిపాళెం, చున్నవారిపాళెం, గుడినరవ తదితర గ్రామాల్లో విషజ్వరాలు ప్రబలడంతో ఆయాప్రాంతాల ప్రజలు భయకంపితులవుతున్నారు. ఇప్పటికే సీతారాంపురం, కొండాపురం, దుత్తలూరు గ్రామాల్లో నలుగురు మృతి చెందారు. పారిశుధ్యం క్షీణించడం, మెరుగుపరచేందుకు చర్యలు చేపట్టకపోవడంతో గ్రామాలు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. చికెన్ గున్యా, డెంగ్యూ జ్వరాలు ప్రబలుతున్నా సంబంధితశాఖల అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రజలు రోగాలతో సతమతం అవుతున్నారు. పేదలు ప్రైవేట్ వైద్యశాలకు వెళ్లి చికిత్స చేసుకొనే స్థోమత లేక ప్రభుత్వ వైద్యశాలకు వెళ్తుంటే అక్కడ వారికి వైద్యం అందించే దిక్కులేకుండా పోవడంతో వారి పరిస్థితి దయనీయంగా వుంది పలు గ్రామాల్లో. ప్రతి ఏడాది ప్రజలు సీజనల్ వ్యాధుల బారినపడి ఆస్పత్రి పాలవుతున్నా పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచాలన్న ధ్యాసే అధికారులకు, సిబ్బందికి లేకపోవడంతో ప్రజలకు అగచాట్లు తప్పడం లేదు.

చిట్టమూరు తీరంలో రోడ్లు!

పనబాక కృష్ణయ్య వెల్లడి

చిట్టమూరు మండలంలోని తీరప్రాంత గ్రామాల్లో రహదారుల నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు గూడూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ పనబాక కృష్ణయ్య తెలిపారు. మల్లాంలో మాజీ సర్పంచ్ దువ్వూరి శేషారెడ్డి నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ ఆయన ఈ వివరాలు తెలిపారు. జాతీయ తుఫాను విపత్తుల నివారణ సంస్థ ఆధ్వర్యంలో 1.30కోట్లరూపాయలు మంజూరైనాయన్నారు. ఈ నిధులతో మండలంలోని తీర గ్రామాలకు రహదారులు నిర్మిస్తామన్నారు. అలాగే రాజీవ్ విద్యామిషన్ ఆధ్వర్యంలో చిట్టమూరు, గునపాడు, ఆరూరు, అరవపాళెం జడ్పీ ఉన్నతపాఠశాలల్లో అదనపు గదుల నిర్మాణానికి నిధులు విడుదలయ్యాయన్నారు. 32లక్షల రూపాయలతో ప్రాంతాల్లో ఆరు అదనపు గదులను నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఉపాధిహామీ పథకం క్రింద మంజూరైన 67 లక్షల రూపాయలతో నాయుడుపేట, దుగరాజుపట్నం రహదారుల విస్తరణకు ప్రతిపాదనలు పంపామన్నారు. ఈ సమావేశంలో మండలపార్టీ అధ్యక్షుడు దువ్వూరు మల్లారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, మధు, కస్తూరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ కాంగ్రెస్‌లో అవమానం!

తీవ్ర మనస్థాపంలో విష్ణు



వైఎస్ రాజశేఖర్‌రెడ్డిపై అభిమానంతో వైఎస్ జగన్‌పార్టీలో వుండిన తనకు సముచిత స్థానం కల్పించకపోవడం తీవ్ర మనస్థాపానికి గురిచేసిందని అల్లూరు మాజీ శాసనసభ్యుడు విష్ణువర్ధన్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. కావలి నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డికి బాధ్యతలు అప్పగించడంతో కినుక వహించిన విష్ణు తన అనుచరులు, అభిమానులతో సమావేశం అయ్యారు. కావలి ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో విలేకరులతో మాట్లాడుతూ జగన్‌పార్టీలో ముందు నుంచి వున్నా చివరకు వెనుకబడిపోయానన్నారు. 25సంవత్సరాల తన రాజకీయ జీవితంలో ఇలాంటి పరిస్థితి తనకెప్పుడూ ఎదురుకాలేదని వాపోయారు. ఈ పరిణామంతో తనకంటే అభిమానులు, అనుచరులు తీవ్రంగా బాధపడ్డారన్నారు. ఇప్పటివరకు కార్యకర్తలు, అభిమానుల సూచన మేరకు నడుచుకుంటున్న తను ఇకపై కూడా వారి అభిష్టానికి అనుగుణంగానే వ్యవహరిస్తానని చెప్పారు. తిరిగి కాంగ్రెస్ పార్టీలోకి పోవడం గురించి మాట్లాడుతూ పాతమిత్రులు అనేకమంది ఆహ్వానిస్తున్నారని దీనిపై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదన్నారు. దీనికి ముందు విష్ణు అభిమానులు రైల్వేస్టేషన్‌కు వెళ్లి ఆయనకు ఘనస్వాగతం పలికారు.



గూడూరులో వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరిగిన మైనార్టీ సదస్సులో ప్రసంగిస్తున్న పేర్నేటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి. వేదికపై భాజావలి, జియావుద్దీన్ తదితరులు.

ఉదయగిరి శివాలయంపై స్మగ్లర్ల కన్ను!

ఉదయగిరిలోని శివాలయం ప్రత్యేకత సంతరించుకొని వుంది. ఇక్కడ వుండే నంది విగ్రహం మరింత ప్రత్యేకత కలది. దేశవ్యాప్తంగా వివిధ దేవాలయాల్లో నంది విగ్రహాలు నల్లరంగులో వుంటే ఇక్కడ మాత్రం నంది విగ్రహం తెల్ల రంగులో వుండడం విశేషం. భక్తులు అధికసంఖ్యలో ఇక్కడకు వచ్చి పూజలు చేస్తుంటారు. ముఖ్యంగా అమావాస్యనాడు నంది విగ్రహంపైన నాగుపాము పెనవేసుకొని వుంటుందట. ఆరోజున భక్తులు దూరం నుంచి దర్శించుకొని వెళ్తుంటారు. అలాంటి

ఆకర్షిస్తున్న తెల్లరంగు నందీశ్వరుడు

నంది విగ్రహంపై కొందరు విగ్రహాలను తస్కరించే ముఠా కన్నుపడింది. దీంతో ఆ ప్రాంతంలో పేరొందిన వ్యాపారి, రాజకీయ అండదండలున్న వ్యక్తి సహకారంతో నందిని తస్కరించే యత్నాలు జరుగుతున్నాయి. అందుకు కారణం విగ్రహంలో 108 వజ్రాలు నిక్షిప్తమై వున్నాయన్న ప్రచారం. ఎలాగైనా ఆ వజ్రాలను సొంతం చేసుకోవాలన్న కుట్రతో ఆలయ పునరుద్ధరణ పేరుతో వీలైతే నందిని తొలగించాలని ప్రయత్నిస్తున్నట్లు గగ్గోలు రేగుతోంది.

● ఉపాధి పనుల్లో

అక్రమాల విచారణకు కోర్టులు!

● గూడూరులో మంత్రి మాణిక్య వరప్రసాద్ వెల్లడి.



ఉపాధిహామీ పథకంలో అవకతవకల నిర్మూలనకు ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేస్తున్నట్లు రాష్ట్ర గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ ప్రకటించారు. గూడూరుకు విచ్చేసిన ఆయన మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం అమలు తీరుపై ఎంపిడిఓ కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. ఉపాధి హామీలో అవకతవకలను అరికట్టేందుకు పలు కొత్తచట్టాలు తీసుకొచ్చామన్నారు. అవినీతి పూర్తిగా నిర్మూలించి పథకం సక్రమంగా అమలయ్యేందుకు జిల్లాస్థాయిలో జడ్జి క్యాడర్‌లో ప్రత్యేకాధికారిని నియమిస్తున్నట్లు చెప్పారు. అలాగే మొబైల్‌కోర్టులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వీటి వలన పథకానికి సంబంధించిన కేసులను సత్వరం పరిష్కరించే అవకాశం కల్గుతుందన్నారు. జిల్లాలో ఇందిరప్రభ, జలపథకం ద్వారా ప్రతిపాదించిన 25వేల ఎకరాల ఎస్సీ, ఎస్టీ భూములను అభివృద్ధి పరచాలని ఆదేశించారు. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి 40వేల కుటుంబాలకు 125రోజుల పని దినాలను కల్పించాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో గూడూరు సబ్‌కలెక్టర్ వీర పాండ్యన్, డిఆర్‌డిఏ పిడి యుగంధర్, తహశీల్దార్ వరకుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశానికి ముందు కాంగ్రెస్ నాయకులు రైల్వే అతిథిగృహంలో ఆయన్ను కలసి స్వాగతం చెప్పారు.

భూ పంపిణీ సక్రమంగా చేయండి!

● వెంకటగిరి ఎమ్మెల్యే సూచన



కలువాయిలో స్త్రీ శక్తి భవనానికి శంకుస్థాపన చేస్తున్న వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ.

ఆరవిడత భూపంపిణీలో అవకతవకలకు తావులేకుండా అర్హులందరికి న్యాయం జరిగేలా చూడాలని వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అధికారులకు సూచించారు. కలువాయిలో మహాత్మాగాంధీ జాతీయగ్రామీణ ఉపాధిపథకం క్రింద 25లక్షల రూపాయలతో నిర్మించనున్న స్త్రీ శక్తి భవన నిర్మాణ పనుల శంకుస్థాపన కార్యక్రమానికి విచ్చేసిన ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ పనులను మంచి నాణ్యతతో జరిపించాలన్నారు. మండలంలోని పలు పాఠశాలల్లో అదనపుగదుల నిర్మాణానికి 76.50లక్షలు మంజూరయ్యాయని తెలిపారు. గత రచ్చబండలో రేషన్‌కార్డులు, ఫించన్లు, ఇందిరమ్మ ఇళ్లకోసం అర్జీలిచ్చిన వారందరికి న్యాయం జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. భూ పంపిణీ విషయమై మాట్లాడుతూ గతంలో జరిపినట్లు తూతూ మంత్రంగా జరపకుండా ఎంత భూమి వున్నది ముందుగా తెలిపి ఆ తరువాత అర్హులందరికి భూమి దక్కేలా చూడాలన్నారు. పనిలో పనిగా కాంగ్రెస్‌పార్టీపై విమర్శలు గుప్పించారు. అలాగే వెంకటగిరి నియోజకవర్గ అసైన్‌మెంట్ కమిటీలోని ముగ్గురు సభ్యుల పేర్లను ప్రకటించారు. ప్రభుత్వం సూచించిన రిజర్వేషన్ల దామాషా ప్రకారం ఓసి కేటగిరిలో డక్కిలికి చెందిన పోలంరెడ్డి వెంకటరెడ్డి, బిసి కేటగిరిలో బాలాయపల్లికి చెందిన జడపల్లి నారాయణమ్మ, ఎస్‌సి కేటగిరిలో కలువాయికి చెందిన డి.పెంచలయ్యలను తీసుకొన్నట్లు తెలిపారు. వీరి నియామకం పట్ల పలువురు టిడిపి నేతలు హర్షం ప్రకటించారు.

భూ వివాదాలు పరిష్కరించండి!

పొదలకూరులో ఆదాల సలహా

పొదలకూరు మండలంలో దీర్ఘకాలంగా అపరిమితంగా వున్న భూవివాదాలను తక్షణం పరిష్కరించాలని సర్వేపల్లి శాసనసభ్యుడు ఆదాల ప్రభాకర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. పొదలకూరుకు వచ్చిన ఆదాల స్థానిక ఆర్‌అండ్‌బి అతిథిగృహంలో మండల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో తనకు వచ్చే వినతుల్లో అధికంగా భూ సమస్యలపైనే వుంటున్నాయన్నారు. తాటిపర్తి పంచాయితీ బత్తులపల్లిపాడు సర్వేనెంబర్ 26లో మహ్మదాపురం బీడి కార్మికులకు, స్థానికులకు భూపంపిణీపై వివాదం నెలకొని వుందని దీనిపై విచారించి సర్వే చేసి అర్హులైన వారికి అందజేయాలని తహశీల్దార్‌ను ఆదేశించారు. సూరాయపాళెం బిసికాలనీలో మంచినీటి సమస్య గురించి ఎమ్మెల్యే దృష్టికి తీసుకొనిరాగా ఆయన తక్షణం స్పందించి నీటి సమస్య పరిష్కరించాలని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశంలో మండల ప్రత్యేకాధికారి మనోహర్, ఎంపిడిఓ సరళ తదితరులు పాల్గొన్నారు.

కాగితాల్లో తుమ్మలపెంట బీచ్

తుమ్మలపెంట బీచ్‌ను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలన్న ప్రతిపాదన కాగితాలకే పరిమితం అవుతోంది తప్ప ఆచరణకు నోచుకోకపోవడంతో పలువురు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు హామీలు గుప్పించినప్పటికీ తుమ్మలపెంట అభివృద్ధి మాత్రం ఒక్క అడుగు ముందుకు పడలేదు. 2009సంవత్సరంలో 3.77కోట్లు మంజూరు

కార్య రూపం దాల్చేదెన్నడో?

చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. దీనిపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈ నిధులతో పర్యాటక ప్రాంతంగా తుమ్మలపెంట అభివృద్ధి చెందుతుందని ఆశించిన వారికి ఆశాభంగం ఎదురయ్యిందే తప్ప అభివృద్ధి దిశగా చర్యలు శూన్యం. అటు అధికారులు, ఇటు ప్రజాప్రతినిధులకు దీనిపై తగిన శ్రద్ధ లేకపోవడమే పనుల జాప్యానికి కారణమనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికైనా ఈ ప్రాంతంపై దృష్టి సారించి అభివృద్ధికి చర్యలు చేపట్టాలని పలువురు కోరుకొంటున్నారు.

ఆర్టీసి బస్టాండ్‌లో కనీస వసతులు కరవు




● దుస్థితిలో నాయుడుపేట బస్టాండ్

నాయుడుపేట ఆర్టీసి బస్టాండు అధ్వాన్నంగా వుంది. ప్రయాణీకులకు కనీస సౌకర్యాలు కల్పించడంపై అధికారులు దృష్టి సారించకపోవడంతో ఇక్కడకు వచ్చేవాళ్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వ్యాపార కేంద్రంగా వుండే నాయుడుపేటకు తమిళనాడు, కర్నాటకల తోపాటు జిల్లా నలుమూలల నుంచి ప్రయాణీకులు బస్టాండుకు వస్తుంటారు. బస్టాండు అభివృద్ధి పేరుతో ప్రతి ఏడాది ఖర్చు చేస్తున్నప్పటికీ కనీస సౌకర్యాలు, వసతులు లేకపోవడంతో ప్రయాణీకులు పడుతున్న అగచాట్లు అన్ని ఇన్ని కావు. ఇక వర్షం వస్తే బస్టాండు కళ చూడాల్సిందే. వర్షపు నీరు బయటికి వెళ్లే మార్గం లేకపోవడంతో బస్టాండులో నీరు నిలిచిపోతుంది. ఆ సమయంలో ప్రయాణీకులు పడే బాధలు వర్ణనాతీతం. ఆర్టీసి అధికారులు మాత్రం నాయుడుపేట బస్టాండును మోడల్ బస్టాండుగా తీర్చిదిద్దుతామని ప్రకటనలు గుప్పించడం మినహా ఆచరణలో చూపకపోవడంతో బస్టాండుకు రావాలంటేనే ప్రయాణీకులు హడలిపోతున్నారు.




కోమటిరెడ్డి దీక్ష వెనుక...

మాజీమంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, తెలంగాణ రాష్ట్రం కోరుతూ చేపట్టిన నిరవధిక నిరాహారదీక్ష వెనుక పెద్ద తతంగమే నడిచిందట. కోమటిరెడ్డి వృత్తిరీత్యా కాంట్రాక్టర్. వై.ఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆశీస్సులతో వ్యాపారంలో బాగా సంపాదించాడు. అలాగే రాజకీయంగా ఎదిగి రాష్ట్రమంత్రి అయ్యాడు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలక పాత్ర నిర్వహిస్తూ మంత్రి పదవికి రాజీనామా చేశాడు. సిఎం కిరణ్‌తో తీవ్రంగా విభేదించి ఢిల్లీ పెద్దల వద్ద ఫిర్యాదు కూడా చేశాడు. కోమటిరెడ్డి వ్యవహార శైలిపై కేంద్ర నిఘా వర్గాలు ఓ ప్రత్యేక నివేదిక పంపాయి. నివేదికను చూసిన ప్రణబ్ కన్నెర్ర చేశాడు. తనను కలవడానికి వచ్చిన కోమటిరెడ్డితో ప్రణబ్ ముఖర్జీ తీవ్రంగా మందలించాడు. నీ వ్యవహారమంతా తెలుసు. కాంగ్రెస్‌లో వుంటూ జగన్‌తో నీ సంబంధాలు మాకు తెలియవనుకోకు. ఎలాగు నువ్వు జగన్ పార్టీలోకి పోతావు నీతో కాంగ్రెస్‌కు కమిట్మెంట్ ఏమీ లేదు. నీ ఇష్టం వచ్చింది చేసుకో!! అంటూ ప్రణబ్ మందలించే సరికి కోమటిరెడ్డికి తాడోపేడో తేల్చుకోవాల్సిన పరిస్థితి ఎదురైంది. అందుకే కాంగ్రెస్‌తో తెగతెంపులకు సిద్ధపడి తెలంగాణ పేరుతో నిరవధిక నిరాహారదీక్షకు కూర్చున్నాడట. క్రింద పడ్డా పైచేయి అనిపించుకోవాలి కదా!




అసెంబ్లీ రొచ్చులో కిరణ్




సిఎం కిరణ్ అసెంబ్లీ రొచ్చులో ఇరుక్కుపోయారా? అవుననే అంటున్నాయి అసెంబ్లీ వర్గాలు. కిరణ్ అసెంబ్లీ స్పీకర్‌గా వున్నప్పుడు సుమారు 20కోట్ల రూపాయల నిధులు దుర్వినియోగం అయ్యాయట. లెక్కాపక్కాలేని నిధులు ఏమయ్యాయో అర్థం కావడం లేదట. ప్రస్తుత స్పీకర్ మనోహర్ దృష్టికి ఈ వ్యవహారం రాగానే ఆయన సిఎంకు లేఖ వ్రాశాడు. మీరు స్పీకర్‌గా వున్నప్పుడు అసెంబ్లీ నిధులు గోల్మాల్ అయ్యాయి. ప్రాథమిక సమాచారం ప్రకారం 20కోట్ల రూపాయలకు లెక్కలే లేవు. విచారణ జరిపిస్తే ఇంకా ఎంత తేలుతుందో తెలీదు. సమాచారం నిమిత్తం ఈ విషయం మీకు తెలుపుతున్నాను – ఇది స్పీకర్ ఉత్తరం సారాంశం. ఈ ఉత్తరం వ్రాసి మూడు నెలలు దాటుతున్నా సిఎం నుంచి సమాధానం రాలేదట. దీంతో స్పీకర్ కార్యాలయం ఈ ఉత్తరాన్ని పత్రికలకు లీక్ చేసింది. పత్రికల్లో ప్రముఖంగా రావడంతో దీనిపై శాఖాపరమైన విచారణకు స్పీకర్ ఆదేశించాడు. అయితే ఇంత పెద్ద కుంభకోణంపై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ద్వారా కానీ, లేక ఎసిబి ద్వారా కానీ దర్యాప్తు జరపాల్సి వుండగా మొక్కుబడిగా శాఖాపరమైన విచారణకు ఆదేశించడం వెనుక పెద్ద మతలబే వుందంటున్నారు. ఎంతైనా సిఎం స్పీకర్‌గా వున్న కాలం కాబట్టి కాస్త వెనుకా ముందు చూసుకోవాల్సి వుంటుందని స్పీకర్ కార్యాలయ వర్గాలు అంటున్నాయి.

టిఆర్ఎస్‌లోకి కాంగ్రెస్ వలస



టిఆర్ఎస్‌లోకి కాంగ్రెస్ వలస ఎక్కువ అయ్యింది. ప్రత్యేక తెలంగాణ నేపథ్యంలో వచ్చే ఎన్నికల్లో తెలంగాణ ప్రాంతంలో కాంగ్రెస్ పార్టీకి గడ్డు పరిస్థితి వుంటుందని ఆ పార్టీ నేతలు భావిస్తున్నారు. దీపం వుండగానే ఇల్లు చక్కదిద్దుకోవాలన్న చందంగా ఉద్యమం వేడెక్కివున్నప్పుడే పార్టీ ఫిరాయించడానికి తెలంగాణ కాంగ్రెస్ నేతలు క్యూ కడుతున్నారు. ఇప్పటికే ముగ్గురు ఎమ్మెల్యేలు గులాబీ కండువా వేసుకున్నారు. ఎంపీలు మందా జగన్నాధం, పొన్నం ప్రభాకర్ కూడా త్వరలో గులాబీ గడప తొక్కుతారని అనుకుంటున్నారు. కెసిఆర్ కూడా కాంగ్రెస్ ప్రజాప్రతినిధులకు సందేశాలు పంపుతున్నాడు. ఇప్పుడు గనక పార్టీలోకి వస్తే మీ సీటు మీదే... అంటూ ప్రలోభపెడ్తున్నాడట. దీంతో కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు టిఆర్ఎస్‌లోకి క్యూ కట్టకతప్పడం లేదు. పాపం కిరణ్ సర్కారు... మైనార్టీ గండంలో ఇరుక్కోదు కదా! అంటూ కిరణ్ సానుభూతిపరులు చెవులు కొరుక్కుంటున్నారు.

మంత్రివర్గ మార్పులు లేనట్లేనా?



కిరణ్‌కుమార్‌రెడ్డి మంత్రివర్గంలో మార్పులు ఇప్పట్లో జరిగేట్లు కనబడడం లేదు. దీపావళి నాటికి మంత్రివర్గంలో మార్పులు-చేర్పులు చేయాలని కిరణ్ ప్రయత్నించాడు. అయితే కాంగ్రెస్ నుంచి టిఆర్ఎస్‌లోకి వలసలు ఎక్కువ అవుతున్న ఈ సమయంలో మంత్రివర్గ మార్పులు మంచిది కాదంటూ అధిష్టానం మోకాలు అడ్డిందట. మంత్రివర్గంలో తనకు తలనొప్పులు తెస్తున్న శంకర్రావు వంటి వారిని తొలగించాలని కిరణ్ ఓ నిర్ణయానికొచ్చాడు. అలాగే తనకు దగ్గర వారైన ఒకరిద్దరిని మంత్రివర్గంలోకి తీసుకోవాలనుకున్నాడు. అయితే మార్పుచేర్పులకు ఇది తగిన సమయం కాదంటూ... ఢిల్లీ పెద్దలు వారించారట. దీంతో కిరణ్ నీరసపడిపోయాడు. ప్రస్తుత మంత్రులతో ఇంకా ఎంత కాలం ఇబ్బంది పడాలంటూ నెత్తీనోరు బాదుకుంటున్నాడట పాపం కిరణ్!



నెల్లూరు శ్రీచంద్రారెడ్డి డిగ్రీ కళాశాలలోని రోటరాక్ట్ క్లబ్ విభాగంలోని విద్యార్థులు సరస్వతి నిధికి 30 వేల రూపాయలు సేకరించి జిల్లా కలెక్టర్ శ్రీధర్‌రెడ్డికి అందిస్తున్న దృశ్యం. చిత్రంలో కళాశాల కరస్పాండెంట్ ప్రతాప్‌రెడ్డి, వేలూరు శ్రీనివాసులు, రాఘవేంద్రషెట్టి వున్నారు.



వర్షాలకు తటాకాన్ని తలపిస్తున్న నెల్లూరు రైల్వే ఫీడర్స్ రోడ్డు.



కలెక్టరేట్ ముందు వైపు నుంచి వెళ్లే ఆచారివీధిలో నిలచిన నీటిలో వాహన చోదకుల పాట్లు.



క్షీరాబ్ది ద్వాదశినాడు శ్రీహరి అర్చన శ్రేష్ఠం!


కార్తీక మాసంలో వచ్చే అత్యంత పుణ్యప్రదమైనది కార్తీకశుక్ల ద్వాదశి. దీనినే క్షీరాబ్ధి ద్వాదశి అంటారు. ఆషాడ శుద్ధ ఏకాదశినాడు యోగనిద్రకు ఉపక్రమించిన శ్రీమహావిష్ణువు నాలుగు మాసాల తర్వాత కార్తీక శుద్ధ ఏకాదశినాడు నిద్ర నుండి మేల్కొని మునులకు, దేవతలకు తొలిసారిగా క్షీరసాగరం నుంచి దర్శనం ఇచ్చేది ఈ ద్వాదశి నుండే కాబట్టి దీనిని క్షీరాబ్ధి ద్వాదశిగా పిలుస్తారు. దుర్వాస మహర్షి శాపం కారణంగా సామ్రాజ్యాన్ని కోల్పోయి తేజోవిహీనులైన ఇంద్రాది దేవతలు శ్రీమహా విష్ణువును శరణువేడినపుడు ఆయన సూచనపై అసురులతో కలసి క్షీరసాగరాన్ని మధించడం ప్రారంభించారు. క్షీరాబ్ధిని మధించిన రోజైన ద్వాదశికి క్షీరాబ్ధి ద్వాదశి అని పేరొచ్చిందని పురాణాలు చెప్తున్నాయి.

క్షీరాబ్ధి ద్వాదశినే కైశికద్వాదశి అనికూడా అంటారు. దీనికి సంబంధించి పురాణ కథనం ఒకటి వుంది. దక్షిణ భారతంలో తిరునల్వేలి ప్రాంతంలో తిరుక్కురం గుడిలో వామనావతారమైన విష్ణువును నిత్యం భక్తిశ్రద్ధలతో పూజిస్తూ కైశిక రాగంలో గానం చేస్తూ ఆరాధించేవాడు మాలదాసరి అనబడే సత్యమూర్తి. అక్కడకు కొద్దిదూరంలో గల మాలపల్లిలో జన్మించిన ఆయన ప్రతి నిత్యం వేకువనే లేచి ఆలయానికి వెళ్లి అక్కడ కైశికరాగంలో భక్తిగీతాలు పాడి తీర్థప్రసాదాలు స్వీకరించి తిరిగి ఇంటికి చేరుకోవడం అలవాటు. ఆ క్రమంలో కార్తీకశుద్ధ ద్వాదశినాడు వేకువ జాము అయిందన్న భ్రమలో రాత్రివేళలోనే నిద్ర మేల్కొని గుడికి బయలు దేరాడు. రాత్రి సమయంలో చీకటిలో దారి తప్పి అడవికి చేరుకొంటాడు. అక్కడ వున్న బ్రహ్మరాక్షసుడు అతన్ని అటకాయించి ఆరగించేందుకు సిద్ధపడగా, సత్యమూర్తి రాక్షసుడ్ని బ్రతిమలాడి తాను గానవ్రతంలో వున్నానని, శ్రీహరి ఆలయానికి చేరుకొని గానం చేసి వ్రతం పూర్తి చేసుకొని వస్తానని అప్పుడు ఆహారం అవుతానని చెప్పి ఒప్పించి విష్ణుపూజకు బయలు దేరుతాడు. అక్కడ యధావిధిగా గానార్చన చేసి స్వామిని ఆరాధించి తిరిగి ఇచ్చిన మాట ప్రకారం బ్రహ్మరాక్షసుని వద్దకు వెళ్తాడు. అతడి సత్యసదనకు పరివర్తన చెందిన రాక్షసుడు మాలదాసరి కాళ్లపైబడి తన పూర్వజన్మ వృత్తాంతం చెప్పి శాపవిమోచనం కల్గించమంటాడు. అప్పుడు సత్యమూర్తి తన గానామృతంతో విముక్తి కల్గిస్తాడు. ఇదంతా జరిగింది కార్తీక శుద్ధ ద్వాదశి నాడైనా కైశిక రాగంతో గానం చేసినందున కైశిక ద్వాదశి అని పేరొచ్చింది.

ఎల్లప్పుడూ క్షీరసాగరంలో వుండే శ్రీమన్నారాయణుడు ఈ ద్వాదశిరోజు శ్రీమహాలక్ష్మి సమేతుడై బృందావనానికి వచ్చి భక్తులకు దర్శనమిస్తాడు కాబట్టి బృందావన ద్వాదశి అని అంటారు. బృందావనం అంటే తులసివనం. ఆ రోజు బృందావనంలో శ్రీహరిని అర్చించి వారికి సకల శుభాలు కల్గుతాయని శాస్త్రాలు చెప్తున్నాయి. క్షీరసాగర మధనంలో ఆవిర్భవించిన శ్రీమహాలక్ష్మిని విష్ణువు వివాహమాడిన రోజు కూడా క్షీరాబ్ధి ద్వాదశినాడే. అందుకే పవిత్రమైన ఆరోజును వీరి కళ్యాణం జరిపించడం సర్వశుభప్రదం అంటారు. మహావిష్ణువు క్షీరసాగరం నుంచి దర్శనమిచ్చే సందర్భంలో కొన్ని చుక్కలు మునుల మీద, దేవతల మీద చిలకరించబడ్డాయట. అందుకే చినుక ద్వాదశి అని, అమృతం కోసం క్షీరసాగరాన్ని చిలికారు కాబట్టి చిలుక ద్వాదశి అని, యోగీశ్వర ద్వాదశి అని, హరిబోధినీ ద్వాదశి అని పిలుస్తారు.


ట్రంకురోడ్డు

మాదాసు ముఖమే కనపడాలి!




సిసి ఉపాధ్యక్షునిగా హైదరాబాద్, ఢిల్లీలలో చక్రం తిప్పే మాదాసు గంగాధరంకు నెల్లూరులో ఫేస్ వాల్యూ తక్కువ. ఆయన్ను ఐరన్‌లెగ్ గంగాధరం అంటుంటారు. స్వగ్రామం కుల్లూరులో మాత్రం ఆయన ఏక్ దిన్‌కా సుల్తాన్. గ్రామంలో ఎవరైనా ఫ్లెక్సీ గట్రా కడితే ఆయన బొమ్మ ఖచ్చితంగా ఉండాలంట. అలా లేకుండా ఫ్లెక్సీ కడితే తక్షణం చింపించను ఒక ముఠాను ఆయన ఏర్పాటు చేశాడట. గంగాధరం ఎక్కడైనా ప్రత్యేకంగా కనపడను చేసుకొనే ఏర్పాట్లపై ట్రంకురోడ్డులో విస్తృత చర్చ జరుగుతుంది.

మాస్ మహారాజులు



సినీ పరిశ్రమ మద్రాస్‌లో స్థిరపడివున్నప్పుడు విడుదలైన సినిమా టాక్ కోసం నెల్లూరు ప్రేక్షకులపై ఆధారపడేవాళ్లు సినీ నిర్మాతలు. పరిశ్రమ హైదరాబాద్‌కు వెళ్లి స్థిరపడినా నెల్లూరులో మంచి టాక్ వస్తే సినిమా హిట్ అనేది నేటికి కొనసాగుతున్న నానుడి. నిప్పులు చెరిగే ఎండ, ఎముకలు కొరికే చలి, గాలివానలో సైతం నెల్లూరు జనం సినిమాలకు వెళ్లడం మానరు. ఇంత ఉపోద్ఘాతం ఎందుకంటే నెల్లూరులో మాగుంటోళ్లు కొత్తగా కట్టిన మూడు మల్టీప్లెక్స్ థియేటర్లలో టిక్కెట్లు 100, 80, రూపాయలుగా ఉన్నా ప్రేక్షకులు పట్టించుకోవడం లేదు. గోల్డ్ క్లాస్‌లోనూ మాస్ మహారాజులు కాలుమీద కాలువేసుకొని కూర్చొని సినిమా చూస్తుండగా అడ్వాన్స్ బుకింగ్‌ల పుణ్యమా అంటూ నెల్లూరులో పెద్ద పెద్ద వాళ్లంతా క్రింది వరుస సీట్లలో కూర్చొని సినిమా చూడడంపై కమ్యూనిస్టులు సినిమా హాళ్లలో సామ్యవాదమని కొత్తయిజం చెప్పకతప్పని పరిస్థితులు నేడున్నాయి.

తిట్ల పురాణం



సబ్జెక్ట్ దొరకాలేగానీ నెల్లూరు రాజకీయ నేతలు తిట్ల పురాణానికి లంఘించుకొంటారు. నగరంలో ఇళ్ల పన్నుల పెంపకంపై వైఎస్ఆర్ కాంగ్రెస్, కాంగ్రెస్ నేతల మధ్య పెద్ద మాటల యుద్ధమే జరుగుతుంది. వైఎస్ఆర్ కాంగ్రెస్ నగర నేత పోలుబోయిన అనిల్ సిటీ ఎమ్మెల్యే శ్రీధర్‌కృష్ణారెడ్డిని బినామీ కాంట్రాక్టర్, కారు స్టెప్నీగా అభివర్ణిస్తే ప్రతిగా శ్రీధర్‌కృష్ణారెడ్డి అనిల్‌ను పనికిమాలిన టైర్ అన్నాడు. తన అన్న కుమారుడు శ్రీహరి బినామీగా అనిల్ సైతం ఎన్నో మునిసిపల్ కాంట్రాక్ట్‌లు చేశాడనడంతో ఒక్కసారిగా అనిల్ ఇమేజ్ ట్రంకురోడ్డులో డామేజ్ అయిపోయింది.

నిప్పో సాయిబాబాకు మురికినీటి పరీక్ష



అగ్ని పరీక్ష అంటే చాలా క్లిష్టమైన సమస్యని అందరికీ తెలుసు. నెల్లూరు నగరంలో అనతి కాలంలో భక్తగణ శ్రేణితో అలరారుతున్న నిప్పో సెంటర్ షిర్డి సాయిబాబా ఈ వారంలో పడిన వర్షానికి మురికినీటి పరీక్షను ఎదుర్కోవడం చర్చనీయాంశమయ్యింది. వేదాయపాళెం నుంచి ఆత్మకూరు బస్టాండ్ వరకు ట్రంకురోడ్డుపై డివైడర్ల పేరిట తన మనుషులకు ఉపాధి హామీ పథకంలో భాగంగా పెద్ద గోడలే కట్టించాడు ఎమ్మెల్యే వివేకానందరెడ్డి. చిన్నపాటి వర్షం కురిస్తే చాలు ఈ డివైడర్ల మూలాన ట్రంకురోడ్డులో నీళ్లు నిలబడిపోతున్నాయి. 29వ తేది వేకువజామున కుండపోతగా కురిసిన వర్షానికి నిప్పో సెంటర్‌లోని షిర్డి సాయిబాబా మందిరంలోకి నీళ్లు వెళ్లిపోయాయి. సాయిబాబాకు మురికి నీళ్లు అంటడంతో ఆయన భక్తులు విలవిలలాడిపోయారు. జనం దైవంగా కొలిచే బాబాకు వివేకా వల్ల వచ్చిన కష్టాలపై మెటికలు విరుస్తున్నారు.

ఎన్నాళ్లకు గుర్తింపు



పోలీస్ శాఖలో అంతర్భాగమైన సిబిసిఐడి విభాగంలో పనిచేసే అధికారులు, సిబ్బంది ముక్కుమూసుకొని జపంచేసే కొంగలను తలపిస్తారు. ఎక్కడ పనిచేస్తున్నారో, ఏమి చేస్తున్నారో సామాన్య జనానికి అసలు తెలియదు. అటువంటి సిఐడి విభాగానికి మనీ సర్క్యులేషన్ స్కీం దర్యాప్తు బాధ్యతలు అప్పగించడంతో ఒక్కసారి జనం నోళ్లలో నానుతుంది. నెల్లూరు మూలపేటలోని పోలీసు క్వార్టర్ల వెనుక ఒక మూల ఉండే సిఐడి కార్యాలయం రోడ్డు వారం పది రోజులుగా వందల సంఖ్యలో వస్తూపోతున్న జనంతో ఉదయం నుంచి రాత్రి వరకు నిండి వుంటున్నది. పది మందికి సమాధానం చెప్పను తలపట్టుకొనే మనుషులున్న ఈ రోజుల్లో ఒకవైపు శాఖాపరమైన పనిచేస్తూనే జనానికి సమాధానం చెబుతున్న సిఐడి డిఎస్పీని చూస్తే అందరికీ జాలేస్తుంది.



మేషం
అశ్వని, భరణి, కృత్తిక 1 పా

ధనాదాయ విషయంలో ఎలాంటి లోటుండదు. గృహనిర్మాణాది కార్య క్రమాలలో పాల్గొంటారు. ఆర్థికవృద్ధి చక్కగా వుంటుంది. కుటుం బంలో సంతోషకరమైన వాతావరణం వుంటుంది. పిల్లలకు విద్యా భ్యాసం చక్కగా సాగుతుంది. మంచి యోగకాలం. వ్యాపారులకు ధనాదాయంతోపాటు శ్రమ ఖర్చు కూడా వుంటుంది. వారసత్వ ఆస్తి విషయాలు ఒక కొలిక్కి వస్తాయి.



వృషభం
కృత్తిక 2,3,4 పా. రోహిణి, మృగశిర 1,2 పా

భాగస్వామ్యం చక్కగా సాగుతుంది. కలసిమెలసి చేసే పనులు బాగా సాగుతాయి. హృదయానందకరమైన పరిస్థితులు చోటుచేసుకొం టాయి. ఆర్థిక లావాదేవీలు లాభకరంగా ముగుస్తాయి. శుభకార్యా లకు ఖర్చు చేస్తారు. ఖర్చులు అధికమనిపించినా మనశ్శాంతి లభి స్తుంది. ఉద్యోగులకు మంచికాలమనే చెప్పాలి. పై నుండి రావల సిన వేతనోన్నతి లాభదాయకంగా ఉంటుంది.



మిథునం
మృగశిర 3,4 పా. ఆర్ద్ర,పునర్వసు,1,2,3 పా

కష్టసుఖాలు సమానంగా చోటు చేసుకొంటాయి. ఊహించనిరీతిలో ధనవ్యయమవుతుంది. ఎంత పొదుపు చేయాలనుకున్నా వీలుకాదు. సోదరులమూలంగా ఖర్చు అవవచ్చు. బంధుమిత్రుల సహాయసహ కారాలందుతాయి. గృహనిర్మాణం లేదా వసతి గృహాన్ని అమ్మడం అనే పనులలో నిమగ్నమవుతారు. గృహిణులకు ఋతుసంబంధిత బాధలుంటాయి. విద్యార్థులకు కొంత మేలు.



కర్కాటకం
పునర్వసు 4 పా. పుష్యమి, ఆశ్లేష

గడచినకాలం కన్నా మేలైన కాలం. విరోధులు తగ్గుముఖం పడ తారు. పద్ధతి ప్రకారం పనులు నిర్వహిస్తారు. ప్రయాణాలు సుము ఖంగా సాగుతాయి. ఆర్థిక లావాదేవీలు మీకనుకూలంగా వుంటాయి. ఇన్నినాళ్ళు ఆటంకాలతో అడ్డుపడ్డ పనులు ఊపందుకొంటాయి. నూతన ఉద్యోగావకాశాలు లభించవచ్చు. భూభవనాల ద్వారా ఆదాయ మార్గాలు సులభతరమవుతాయి. వారసత్వాలు లాభిస్తాయి.



సింహం
మఖ, పుబ్బ ఉత్తర 1 పా

ఆరోగ్యవిషయంలో శ్రద్ధ అవసరం. గొంతు ఊపిరితిత్తులకు సంబం ధించిన బాధలు అధికం. ధన విషయాలలో లోటు లేదు. వివిధ మార్గాలలో ధనప్రాప్తి అవకాశాలు. ఆగిన పనులు నిదానంగా సాగు తాయి. ఇతరులతో అభిప్రాయభేదాలు రావచ్చు. సంతానం వివాహ శుభ కార్యాచరణకు శ్రీకారం చుడతారు. మాట నిలబెట్టుకోవడానికి శ్రమ పడతారు. రాజకీయులకు ఉత్తమకాలం. విద్యార్థులకు శ్రమ.

కన్య
ఉత్తర 2,3,4పా, హస్త, చిత్తా 1, 2 పా

వృథా ఖర్చులు తయారుగా వుంటాయి. అధికారులతో జాగ్రత్త. ప్రతి అడుగు ఆచితూచి వేయడం మంచిది. అనవసరపు విషయాలలో జోక్యం చేసుకోకుండడం మంచిది. ఆర్థికవిషయాలు కొంత తృప్తిక రంగా వుంటాయి. వ్యాపారులు భాగస్వాములతో సఖ్యంగా వుండ డానికి ప్రయత్నించండి. కఠినంగా మాట్లాడవద్దు. రాజకీయులు తోటి వారి విషయంలో జాగ్రత్తగా వుండాలి. పైవారిని విమర్శించకుండాలి.

వారఫలాలు

తేది 05-11-2011 నుండి 11-11-2011 వరకు తులలో రవి; వృశ్చికంలో బుధ, శుక్ర, రాహువులు; మేషంలో గురువు; సింహంలో కుజుడు; కన్యలో శని; వృషభంలో కేతువు; కుంభ, మీన, మేషాల్లో చంద్రుడు సంచరిస్తారు.

పంచాంగం

6 తేది ఉత్థాన ఏకాదశి. 7తేది బక్రీద్, చిలక ద్వాదశి. 10తేది కార్తీక పౌర్ణమి, గురునానక్ జయంతి.

శుభ ముహూర్తాలు

5, 7తేదీలలో ధనుర్ లగ్నాన ఉ.10.00 నుండి 11.30 గంటల వరకు.
6, 9తేదీలలో మిథున లగ్నాన రా.08.00 నుండి 10.00 గంటల వరకు.
కర్కాటక లగ్నాన రా.10.00 నుండి 12.00 గంటల వరకు. శుభముహూర్తాలున్నాయి.

నవంబర్ తిథులు

కార్తీక శుద్ధ

5	శని	దశమి	ప 03.28	గం.ల.వ
6	ఆది	ఏకాదశి	సా 04.50	గం.ల.వ
7	సోమ	ద్వాదశి	రా 06.32	గం.ల.వ
8	మంగళ	త్రయోదశి	రా 08.34	గం.ల.వ
9	బుధ	చతుర్దశి	రా 10.41	గం.ల.వ
10	గురు	పౌర్ణమి	రా 12.49	గం.ల.వ

కార్తీక బహుళ

11	శుక్ర	పాడ్యమి	రా 08.31	గం.ల.వ

పి.ఎం.గోపాలాచారి
16/1020, పొగతోట, నెల్లూరు – 1.
E-mail:maripmgg@yahoo.com



తుల
చిత్తా 3,4 పా, స్వాతి, విశాఖ 1,2,3 పా

అధిక ఖర్చులు మనసును కుంగతీస్తాయి. దూరప్రయాణావకాశాలు. కొంత ప్రయత్నం తర్వాతనే పనులు సాగుతాయి. దైవ కార్యాలలో ఎక్కువగా పాలు పంచుకోవాలి. వ్యాపారులకు లాభాలలో కొంత కోత ఏర్పడవచ్చు. నిదానంగా ఖాతాదారుల మనసెరిగి నడచు కోవడం మంచిది. భాగస్వాములతో గొడవలు రాకుండా చూసు కోవాలి. రాజకీయులు లేనిపోని గొడవల్లో చిక్కుకొంటారు.



వృశ్చికం
విశాఖ 4 పా, అనూరాధ, జేష్ఠ

చాలా ప్రోత్సాహకరమైన కాలం. ప్రయాణాలలో జాగ్రత్త. అనుకొన్న పనులు అనుకొన్నరీతిలో సాగుతాయి. సంతానమూలంగా సుఖశాం తులు లభిస్తాయి. వారి విద్యారంగం ప్రోత్సాహకరంగా వుంటుంది. ధన విషయంలో లోటుండదు. భవిష్యత్తుకు మంచి పథకాలు వేస్తారు. పురోభివృద్ధి అన్ని రంగాలలో వుంటుంది. రాజకీయులకు అత్యంత అనుకూలమైన కాలం. వ్యాపార విస్తరణ చేస్తారు.



ధనుస్సు
మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1 పా

పౌర సంబంధాలు చక్కగా వుండవు. అధికారులతో, బంధువులతో గొడవలుండవచ్చు. నోరు పారవేసుకోకుండడం మంచిది. ప్రతి పని నిలిచి నిదానంగా చేయడం మంచిది. వృత్తిలో మార్పు చేర్పులుండ వచ్చు. వ్యాపారులకు కొంతవరకు మేలు. భాగస్వాములతో జాగ్రత్త. దైనందిన కార్యక్రమాలలో ఆటంకాలుండవచ్చు. విద్యార్థులకు ఒక మోస్తరుగా చదువు సాగుతుంది. కళాకారులకు ఆశాభంగం.



మకరం
ఉత్తరాషాఢ 2, 3,4 పా. శ్రవణం, ధనిష్ఠ 1, 2 పా

ఆరోగ్యవిషయంలో పెద్దగా చెప్పుకోతగ్గవేమీ లేదు. సాధారణంగా గడచిపోతుంది. ఆర్థికవిషయాలు చక్కగా వున్నాయి. నూతన వస్త్రాభర ణాలు కొంటారు. శ్వేతప్రదరం బాధించవచ్చు. గృహాలంకరణ విష యాలలో ఆసక్తి చూపుతారు. ఖర్చుకు వెరవరు. ప్రతి పనిలో దూకు డధికం. విద్యార్థులకు ప్రయోజనవంతమైన కాలం. అన్ని రంగాలలో ముందంజ వేస్తారు. వ్యాపారులకు అత్యంత చక్కని కాలం.



కుంభం
ధనిష్ఠ 3,4 పా. శతభిషం, పూర్వ భాద్ర 1,2,3 పా

ధన విషయంలో కటకట వుండవచ్చు. సోదరులతో అభిప్రాయ భేదావకాశాలు. పనులు నిదానంగా సాగవచ్చు. ఒకటికి రెండుసార్లు ఆలోచించి చేయడం మంచిది. వ్యాపారులకు గడచిన వారంలో ఏర్పడ్డ నష్టాలను ఈ వారంలో పూడ్చుకో వీలవుతుంది. అప్పులు తీరుస్తారు. విద్యార్థులకు ఒకవిధంగా చదువు సాగుతుంది. ఇంటిలో వివాహసంబంధ విషయాలు ప్రస్తావనకు వస్తాయి.

మీనం
పూర్వాభాద్ర 4 పా, ఉత్తరాభాద్ర, రేవతి

ప్రయాణాలలో జాగ్రత్త అవసరం. ముందుచూపుతో అడుగేయాలి. ప్రతి విషయంలో ఎదుటివారు తప్పుగా అంచనా వేస్తారు. ఋణబాధ లధికం. ఆర్థిక విషయాలు అంతంత మాత్రమే. వ్యాపారులు ఖాతా దారులతో జాగ్రత్తగా మెలగాలి. రాజకీయులకు జనాదరణ ఉన్నా ఏదో తీరని వేదన చోటుచేసుకొంటుంది. ఎవరికి ఎలాంటి మాట ఇవ్వవద్దు. వృత్తిపరుల అంచనాలు తలకిందులౌతాయి.

చూలీ హార్మ్యం ఏకకర్ణ గృహం... వాస్తువేధో దోషాలు!

డాక్టర్ హృషికేష్ హైదరాబాద్

** విశ్వకర్మ మతం, మయవాస్తు గ్రంథాలలో 'చూలీ హర్మ్యం', ఏక కర్ణ గృహం ప్రస్తావనలు న్నాయి. వివరంగా చెప్పగలరా?*

మిద్దెపైన మధ్య భాగంలో ('గర్భం') గది నిర్మాణాన్ని చూలీ హర్మ్యం అని, ఏదో ఒక దిక్కులో మాత్రమే పై గదిని నిర్మించడాన్ని ఏకకర్ణ(కోష్ఠ) గృహమని అంటారు. ఇలా నిర్మించడం శాస్త్ర విరు ద్ధం. పైన నైరుతిలో మాత్రమే గది నిర్మాణం చేస్తు న్నారు. రెండు మూలల్లోనూ గదులు నిర్మించడం కరెక్టు.

డాక్టర్ కుముదినీ బేగం హైదరాబాద్

** ప్రపంచ పర్యావరణ శాస్త్రవేత్తల సమా వేశంలో చికాగో(అమెరికా) భారతీయ వాస్తు ప్రస్తా వనలు వచ్చాయా?*

భారతీయులైన ప్రపుల్ల మెహతా, ఫణిభూ షణ్ భట్టాచార్య సమర్పించిన పత్రాల్లోని భార తీయ వాస్తు థియరీల పట్ల ప్రపంచ శాస్త్రవేత్తలు విపరీతమైన ఆసక్తిని కనబరిచారు. ఇప్పటికే 'నాసా' ఇండియన్ వాస్తు – అండ్ ఇట్స్ సైన్స్' సిద్ధాంతంపై రిసెర్చ్ చేస్తోంది.

బిసినేని రమణమూర్తి చెన్నై

** ఆమె చనిపోయి తొమ్మిది నెలలయింది. రాత్రి శబ్దాలు అందరూ వింటున్నారు. వంటగది నిర్మించాలనుకుంటున్నాను.*

మీ భార్య మరణించాక సంవత్సరం వరకూ లోపలి నిర్మాణాలు కూడదు. అసహజ మరణాలలో కొన్ని ఆత్మలు 'పిశాచాంశ'ను పొందుతా యని 'సమరాంగణ సూత్రధారణ' గ్రంథం చెబుతోంది.

డి.స్వరాజ్యలక్ష్మి సికింద్రాబాద్

** ఒకే కూటమిలో మా ఇద్దరి జన్మ నక్ష త్రాలు. శాంతి చేయించాలని చెప్పారు.*

మీది ఉత్తర, అతనిది చిత్త నక్షత్రాలు. ఇద్ద రివీ 'కాక' కూటమికి చెందిన నక్షత్రాలు. 'సుదర్శన యంత్ర' ప్రతిష్ట చేసుకొంటే సరిపోతుంది.

పెంకెపల్లి శర్వాణి ఉదయగిరి

** 'షష్టాకం' అంటే ఏమిటి? అలా వస్తే నివారణ ఏమిటి?*

ఒకరాశి నుంచి మరొక రాశిని లెక్కిస్తే ఆరు, ఎనిమిది సంఖ్యలు రాకూడదు. అలా వస్తే 'షష్టా కం' అంటారు. అప్పుడు నామ నక్షత్ర గణన చేసి 'నవరత్న'ధారణ చేయిస్తే దోషం పోతుంది.

శకలాల వేంకటాద్రి కర్నూలు

** గృహ నిర్మాణం తర్వాత పరిస్థితులేమీ బాగోలేవు. పరిష్కారం చూపండి?*

ప్లాను చూశాను. గందరగోళంగా వుంది. సరిచేయడమంటే 'కూలగొట్టి కట్టుకోవడమే' సహాయం చేయలేని పరిస్థితి ఇది.

వాస్తు సందేహాలు సమాధానాలు

ఆచార్య సుబ్రహ్మణ్య మహర్షి
4వ వీధి, గాయత్రినగర్, ఎ.కె. నగర్ పోస్టు, నెల్లూరు-4.
ఫోన్: 2322345, సెల్: 9490125878.

నూకరాజు ఆదిశేషారెడ్డి కడప

** ఇంటి ప్లాను, వ్యూఫోటో పంపిస్తున్నాను. ఆమె చనిపోయాక ఎవరికీ నిద్ర పట్టడం లేదు.*

'రష్యన్ శాస్త్రవేత్తలు' ఆ మధ్య 'ఆత్మ' ఫోటోతీసి 'రష్యన్ టైమ్స్' పత్రికలో ప్రచురించాక హిందూ ఆత్మ సిద్ధాంతం సత్యమేననిపిస్తున్నది. పిశాచవేధకు మంత్రగాళ్లతో పనిలేదు. నిర్ణీత రక్ష యంత్రాన్ని దేవుడి గదిలో ప్రతిష్టిస్తే సరిపోతుంది.

టి.సోమన్నశాస్త్రి శ్రీకాళహస్తి

** శ్రీకాళహస్తి ఆలయ నిర్మాణం దోష యుక్తం కాదా?*

ఆగమ శాస్త్రం కూడా ఉత్తర వాయువ్య ద్వార ప్రవేశాన్ని తప్పుపడుతున్నది. అందువల్లే రాయలు స్నానానంతరం తూర్పు ఈశాన్యం వైపు నడిచేలా క్రీ॥శ॥ 1516లో గోపుర నిర్మాణం చేశారు. ఆలయ ద్వార ప్రవేశానంతర 'పాతాళ గణపతి' ఆలయం కూడా దోషప్రదమే.

సూరంపాక ఆదిరెడ్డి హైదరాబాద్

** 'ఈశాన్యం' వంట గది వుంది. ఆ ప్లాటు తీసుకోవచ్చా?*

ఈశాన్యం వంట గది మృత్యువు, బెడ్‌రూం వ్యాధినికలిగిస్తాయి. అవాస్తును ప్రోత్సహించకండి.

పాల్నేటి శంకరయ్య కావలి

** ఊరికి చివర పొలాల్లో ఇల్లు, వెనుక వైపు గుడి. ఒకర్ని చూస్తే ఒకరికి పడటం లేదు.*

కుడివైపు పశ్చిమం వస్తున్నది గనుక అక్కడి తలుపు తీసివేయండి. ఊరి చివర 'శక్తి ఆవాహన' లుంటాయి. కనుక 'రక్షణ' యంత్రాన్ని శాస్త్రవేత్త చేత నిర్ణయింపజేసి ప్రతిష్టించుకోండి.

● విదేశీ బ్యాంకుల్లోని బ్లాక్ మనీని వెనక్కు రప్పిస్తే...

భారతదేశ స్వరూపం రాత్రికి రాత్రే మారిపోతుంది!

స్విస్ బ్యాంకులలో భారతీయ సంపన్నులు దాచిన నల్లధనం మీద విస్తృత స్థాయి చర్చ జరుగుతున్నది. జన చైతన్య యాత్ర జరుపుతున్న ఎల్‌కె.అద్వానీ ప్రతి సభలోనూ ఈ అంశాన్ని ప్రస్తావిస్తున్నారు. ఒక అంచనా ప్రకారం విదేశాలలో ప్రుగ్గుతున్న భారతదేశం సొత్తు విలువ 25 లక్షల కోట్ల రూపాయలు. మరికొందరు దీన్ని 1.5 ట్రిలియన్ డాలర్లు (75 లక్షల కోట్ల రూపాయలని లెక్క కడుతున్నారు.) మన దేశం వార్షిక బడ్జెట్ కేవలం 12 లక్షల కోట్లన్న నిజాన్ని గమనంలోకి తీసుకొంటే, నల్లధనం విలువ ఎంతో తెలుస్తుంది. నిజంగా విదేశాలలో మన సొత్తు 75 లక్షల కోట్లయితే, దాన్ని దేశంలోకి రప్పించగలిగితే భారత దేశ స్వరూపం రాత్రికి రాత్రి మారిపోతుంది. ప్రభుత్వానికి అప్పు అన్నది వుండదు. ప్రజలకు పన్నుల బెడద వుండదు. కరెంట్, రోడ్లు, మంచినీళ్లు, పాఠశాలలు, ఆస్పత్రులు లేని గ్రామం మిగలదు. భారత దేశం అమెరికాను మించిన సంపన్న దేశంగా మారిపోతుంది.

2009 ఎన్నికలలోనే ఈ అంశం ఒక నినాదంగా మారింది. తాము అధికారంలోకి వస్తే, మొత్తం నల్లధనాన్ని వెలికి తీస్తామని హామీ ఇచ్చింది బిజెపి. కానీ జనం ఆ మాటలు నమ్మలేదు. కాంగ్రెస్‌కు అధికారం కట్టబెట్టారు. నల్లధనం వివరాలు తెలుసుకోవడం, తెలిసిన వాటిని బయట పెట్టడం తన వల్ల అయ్యే పని కాదని మన్మోహన్‌సింగ్ చేతులెత్తేశాడు. వివాదం సుప్రీంకోర్టుకు చేరింది. నల్లధనస్తులను బయటపెట్టడానికి మీకేమి ఇబ్బంది అని న్యాయమూర్తులు నిలదీశారు. ఈ లోగా ఫ్రాన్స్ దేశం తమకు తెలిసిన 700 ఖాతాల వివరాలు భారత ప్రభుత్వానికి అందజేసింది. వాటినైనా బయట పెట్టమని కోరితే నిరాకరించాడు ఆర్థికమంత్రి ప్రణబ్ ముఖర్జీ. చట్టాలు, విదేశీ ఒప్పందాలు అందుకు ఒప్పుకోవని బుకాయించాడు. అయితే సుప్రీం కోర్టు ఒత్తిడి వల్ల ఆ 700 మందికి ఇన్‌కంటాక్స్ విభాగం నోటీసులు ఇచ్చింది. దానితో, వారి మీద చర్యకు ఉపక్రమించిన తర్వాత పేర్లు చెప్తానని హామీ ఇచ్చాడు ప్రణబ్ ముఖర్జీ. మొత్తం మీద ఈ అంశంపై కదలిక వచ్చింది.

పన్నుల వేధింపులతోనే పరాయిగడ్డ ఆశ్రయం

అవినీతిపరులైన రాజకీయవాదులు, ఐఎఎస్ అధికారులు, పన్నులెగ్గొట్టే పారిశ్రామికవేత్తలు, షేర్ మార్కెట్ కుబేరులు, సినీ తారలు, దావూద్ ఇబ్రహీం మోస్తరు స్మగ్లర్లు, మాదకద్రవ్యాల వ్యాపారులు వంటి వారంతా తమ అక్రమ సంపాదనను స్విస్ బ్యాంకులలో దాస్తారనే మాట ఎన్నో దశాబ్దాల నుంచి వినపడుతున్నది. నెహ్రూ హయాంలోనే కమ్యూనిస్టులు ఈ వివాదాన్ని వినిపిస్తూ వుండే వారు. మన్మోహన్‌సింగ్ ఆర్థిక సంస్కరణలు అమలయ్యే వరకు భారతదేశంలో పన్నుల వ్యవస్థ అత్యంత సంక్లిష్టంగా వుండేది. నిజాయితీగా సంపాదించినవాడు కూడా పన్నులు కట్టడానికి బాధపడే పరిస్థితి. పైపెచ్చు ప్రభుత్వ వేధింపు దుర్భరంగా వుండేది. సంపాదించడమే నేరమన్నట్లు వుండేవి ప్రభుత్వ విధానాలు. దానితో తమ సంపాదనను గుప్తంగా పెట్టుకోక తప్పని పరిస్థితి.

మరొకప్రక్క దేశంలో పెట్టుబడి పెట్టడానికి అవకాశాలు తక్కువ. మన రూపాయి అత్యంత బలహీనం. దానికి దిగజారుడు తప్ప నిలకడ వుండేది కాదు. రియల్ ఎస్టేట్ భూములు, షేర్ మార్కెట్ వంటి వ్యాపారాలు పరిమితం. దానితో చట్టప్రకారం సంపాదించిన వారు కూడా, తమ సొత్తు దాచుకోవడానికి విదేశీ బ్యాంకులను ఆశ్రయించేవారు. అవి నీతిపరుల సంగతి సరే సరి.

ఎట్లా పంపుతారు?

వేల కోట్ల రూపాయల నగదును దేశం సరిహద్దులు దాటించడం ఎట్లా అన్నా అనుమానం సామాన్య జనానికి కలగడం సహజం. అయితే అందుకు సవాలక్ష మార్గాలున్నాయి. దావూద్ ఇబ్రహీం వంటి హవాలా వ్యాపారులు ఇక్కడ తీసుకొన్న డబ్బును మనం కోరిన చోట ఇచ్చే ఏర్పాటు చేస్తారు. జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి మధుకోడా చిక్కి జైలుకు వెళ్లింది ఈ హవాలా లావాదేవీ వల్లనే. మరికొంత తెలివైనవారు ఎగుమతి దిగుమతి వ్యాపారం ద్వారా డబ్బు తరలిస్తారు. విదేశాల నుంచి ఏదో ఒక పనికిమాలిన సరకును దిగుమతి చేసుకోవడం. పది రూపాయల వస్తువుకు పదివేలు కట్టి, డబ్బు చెల్లించడం, దాన్ని అట్లట్లే స్విస్ బ్యాంకులకు తరలించడం ఒక పద్ధతి. లేదా విలువైన వస్తువులను ఎగుమతి చేసి, కాగితాల మీద విలువ తక్కువ చూపి, మిగిలిన సొత్తును అక్కడ నల్లధనంగా తీసుకోవడం ఇంకొక పద్ధతి. అండర్ ఇన్‌వాయిసింగ్, ఓవర్ ఇన్‌వాయిసింగ్ బాటలోనే అధిక మొత్తాలలో నల్లధనం రాకపోకలు జరుగుతున్నాయి.

స్విట్జర్లాండ్ ఎందుకు?

ప్రపంచంలోని అత్యంత ధనవంతమైన దేశం స్విట్జర్లాండ్. దాని రాజధాని జెనీవా నగరంలోని వీధుల క్రింద నిర్మించిన నేల మాళిగలలో లక్షల కోట్ల రూపాయల విలువైన బంగారు ముద్దలు కొండల వలె గుట్టలు పడి వుంటాయి. వారిది తటస్థ రాజకీయం. ఎవరితోనూ వివాదం వుండదు. అందువల్ల రాజకీయ స్థిరత్వం ఎక్కువ. ప్రజలు సంపన్నులు కాబట్టి, స్విస్ ఫ్రాంక్ అమెరికన్ డాలరు కంటే నిలకడగా వుంటుంది. వారి బ్యాంకింగ్ చట్టాలు కఠినమైనవి. వాటిలో ఖాతాలు తెరిచే వారి వివరాలను చాలా రహస్యంగా పెడతారు. పేరు లేకుండా కేవలం అంకెల రూపంలో ఖాతాలు నడుపుకోవచ్చు. ఏ దేశ ప్రభుత్వం, కోర్టులు కూడా ఆ వివరాలను తీసుకోలేవు. డబ్బు భద్రం, రహస్యం భద్రం, చట్టాలు భద్రం, రాజకీయ స్థిరత్వం భద్రం కావడంతో ప్రపంచ కుబేరులందరూ తమ సొత్తును స్విట్జర్లాండ్‌కు తరలిస్తున్నారు. స్విస్ బ్యాంకులలో ప్రపంచ దేశాల వారందరూ దాచుకొన్న డిపాజిట్ మొత్తం 11.5 ట్రిలియన్ డాలర్లు. (దాదాపు ఆరు



స్విట్జర్లాండ్‌లో బ్లాక్ మనీని డిపాజిట్లుగా స్వీకరించే ఓ బ్యాంకు.

కోట్ల లక్షల కోట్ల రూపాయలు, అంటే మన దేశం యాభై సంవత్సరాల బడ్జెట్‌కు సమానం).

బడుగు దేశాల నుంచే ఈ ధన ప్రవాహం

స్విస్ బ్యాంకులలో వరదలై పారుతున్న నల్లధనంలో నూటికి తొంభై శాతం బడుగు దేశాలకు చెందినదే కావడం గమనార్హం. ఆఫ్రికా ఖండంలోని నిరుపేద దేశాల నియంతలు తమ ప్రజలను దోచుకొన్న సొత్తంతా ఇక్కడే దాచుకొంటుంటారు. వారు పాలించే దేశాలలో తినడానికి తిండి, త్రాగడానికి నీరు వుండవు. కోట్లాది మంది ప్రజలు ఆకలి చావులు చస్తుంటారు. కానీ వారి పాలకులు మాత్రం వేలు, లక్షల కోట్ల రూపాయలు తరలించి స్విస్ బ్యాంకులలో దాచుకొంటూ వుంటారు. ఈ బ్యాంకులలో నల్లధనాన్ని దాచిన భారతీయులలో అత్యధికులు రాజకీయవాదులు, ఐఎఎస్ అధికారులేనని ఒక అంచనా. పన్నులు ఎగ్గొట్టే పారిశ్రామికులు, అక్రమాలు చేసే స్మగ్లర్ల కంటే రాజకీయవాదుల వాటానే ఎక్కువ.

అట్లాంటివి ఎన్నో...

అయితే నల్లధనాన్ని దాచడానికి స్విస్ బ్యాంకులు ఒక్కటే మార్గం కాదు. ప్రపంచంలో అటువంటి దేశాలు డెబ్భై వరకు వున్నాయని అంచనా. వాటిలో ముఖ్యమైనవి ఇవీ

ఆస్ట్రేలియా, బహ్మాస్, బార్బడాస్, బ్రిటిష్ వర్జిన్ ఐల్యాండ్స్, సిప్రస్, ఐజల్ ఆఫ్ మన్, గ్రీస్, మారిషస్, కేమాన్, మొనాకో.

వీటిలో స్విట్జర్లాండ్ పారుగునే వుండే లైచెటెన్‌స్టిన్ చాలా కీలకమైనది. నెల్లూరు నగరం అంత విస్తీర్ణంలో వుండే ఈ చిన్న దేశంలో జనాభా కేవలం 35 వేలు. కానీ అక్కడ 90 వేలకు పైగా విదేశీయుల బ్యాంక్ ఖాతాలున్నాయి. స్విస్ వలెనే ఇక్కడా ఖాతాదారుల రహస్యాలు భద్రంగా కాపాడుతారు.

అమెరికాకు ఆగ్రహం

ఒసామా బిన్ లాడెన్ తీవ్రవాద కార్యకలాపాలు పెరిగిన తర్వాత ఇటువంటి నల్లధనం దాచిపెట్టే దేశాల మీద అమెరికాకు ఆగ్రహం కల్గింది. వీటి ద్వారానే తీవ్రవాదులు డబ్బు మార్పిడి చేసుకొంటున్నారన్న అనుమానంతో, ఆ దేశాల మీద ఒత్తిడి పెంచి, ఖాతాదారుల వివరాలు ఇవ్వాలని గట్టిగా గద్దిస్తున్నది. దానితో ఈ చిరు దేశాలు తమ చట్టాలను కొంతవరకు మార్చుకొంటున్నాయి. అందువల్ల రానున్న ఒకటి రెండు సంవత్సరాలలో విదేశాలలో దాగిన లక్షల కోట్ల రూపాయల నల్లధనం వివరాలు కొంతలో కొంత అయినా బయట పడే అవకాశం ఏర్పడుతున్నది.

ఎప్పటికైనా వస్తుందా?

అయితే ప్రభుత్వం ఎంత ప్రయత్నం చేసినా విదేశాలలో దాగిన నల్లధనం మొత్తం తిరిగి వస్తుందని భావించలేము. ఆ దిశలో ప్రభుత్వం చేసే కృషి ఫలించే అవకాశాలు చాలా తక్కువ. ఇట్లా డబ్బు దాచిపెట్టే చాలా దేశాలు, తమ ఆర్థిక అవసరాల కోసం కేవలం దాని మీదే ఆధారపడుతున్నాయి. ఒక్కసారిగా ఆ డబ్బంతా వెనక్కు పంపితే వాటి ఆర్థిక వ్యవస్థలు కుప్పకూలిపోతాయి. అందువల్ల తమ శక్తి మేర ఈ ప్రయత్నాన్ని ప్రతిఘటిస్తాయే తప్ప, భారత ప్రభుత్వానికి సహకరించవు. ఇటువంటి దేశాలు చాలా వాటిలో మనకు చట్ట పరమైన ఒప్పందాలు కూడా లేవు.

ఇప్పటికే కొంత వచ్చింది

అయితే, ఆర్థిక సంస్కరణల తర్వాత దేశంలో ఆర్థిక అభివృద్ధి, తద్వారా షేర్ మార్కెట్, రియల్ ఎస్టేట్ రంగాలలో అవకాశాలు వృద్ధి కావడం వల్ల చాలా మంది నల్లధన రాకాసులు తమ డబ్బులో

కొరవ 14వ పేజీలో

గందరగోళంగా జీ-వన్!



✍ అల్లూరు రహీం

బాలీవుడ్ బాద్షా షారూఖ్‌ఖాన్ రెండేళ్లకు పైగా శ్రమపడి, 150 కోట్ల రూపాయలకు పైగా వ్యయపరచి హిందీలో నిర్మించిన కనువిందుచేసే గ్రాఫిక్ ఎఫెక్ట్స్ చిత్రమే రా-వన్. ఈ చిత్రం తెలుగు అనువాదం సరిగ్గాలేదు. మాటలు, పాటలు గందరగోళంగా వున్నాయి. రజనీకాంత్ నటించిన రోబో చిత్రానికి కొనసాగింపుగా అన్నట్లు జీ-వన్ చిత్రంలో కొన్ని ప్రత్యేక సన్నివేశాలున్నాయి. పరుగుపెట్టే రైలులో హీరోచేసే ఫైట్ ఈ చిత్రంలోనూ కనిపిస్తుంది. రోబోను ఏ భాషలోనికి అనువదించినా ప్రేక్షకుల మనసు కట్టిపడేసింది. జీ-వన్ అలాకాకపోవడానికి దర్శకుడు అనుభవ్ సిన్హా అనుభవరాహిత్యమే కారణమని తేల్చి చెప్పేయవచ్చు. ప్రేక్షకులను అగ్ర తారాగణంతో అలరించాలని చిత్రం ప్రారంభంలో ఫాంటసీగా చూపించిన సంజయ్‌దత్, షారూఖ్‌ఖాన్, ప్రియాంకా చోప్రాల కాంబినేషన్‌లోని ఎపిసోడ్ అలరించలేదు. చిత్రం మొదలైన 20 నిమిషాలపాటు అర్థంకాని సాంకేతిక పద విన్యాసాలు, శబ్దాలతో ప్రేక్షకుడు గందరగోళపడిపోతాడు. ఆ తర్వాత ఈ చిత్రం గాడిలో పడుతుంది. కంప్యూటర్ ల్యాబ్‌లో రా-వన్, జీ-వన్‌ల పుట్టుక, తన జనకుడ్ని రా-వన్ చంపివేయడం, వారి కుటుంబాన్ని అంతమొందించాలని వెనుకపడడం, ఈ సందర్భంగా కారు ఛేజింగ్, జీ-వన్ ప్రత్యక్షమయ్యి రా-వన్‌తో యుద్ధంచేసి అతడ్ని ధ్వంసం చేయడం, ఆకాశహర్మ్యాలపై చిత్రవిచిత్ర విన్యాసాలు బాగున్నాయి. ట్రైన్ ఎపిసోడ్‌లో ముంబాయి సెంట్రల్ రైల్వేస్టేషన్ బద్దలు, టాక్సీ స్టాండ్‌లో రోబోలా రజనీకాంత్ ప్రత్యక్షమవడం, శక్తికోసం జీ-వన్ కరెంట్ తీగ పట్టుకోవడం, క్లైమాక్స్‌లో పదిమంది రా-వన్‌లు పుట్టుకరావడం వంటి సన్నివేశాలు వ్రాయడం కన్నా వెండితెరపైన చూడడమే బాగుంటాయి. 2డి, 3డి ఎఫెక్ట్‌లో ఇంకా కనువిందు చేస్తాయి. షారూఖ్ ఖాన్ ఈ చిత్రంలో ఏ అంశాలున్నాయో ముందు లేశమాత్రమైనా బయటపెట్టక పోవడం వల్ల విప రీతమైన హైప్‌లో సినిమాకు వెళ్లిన ప్రేక్షకుడ్ని జీ-వన్ సంతుష్టుడ్ని చేయలేక పోయాడనే చెప్పాలి. అర్థంకాని బూతులు పలికే హీరోయిన్ కరీనా షారూఖ్ అర్థాంగిగా, ఒక బిడ్డకు తల్లిలా 'చమక్ చలో' పాటలో జీరో సైజ్ అందాలతో ప్రేక్షకులను మంత్రముగ్దులను చేసిపారేస్తుంది. ఈ చిత్రంలో హీరో జీ-వన్ కన్నా విలన్ రా-వన్ బలిష్టుడు. రా-వన్ పాత్రలో అర్జున్ రాంపాల్ అదర గొట్టేశాడు. ముందు ఎపిసోడ్‌లో ఆకాశి(టాయ్‌వూ)లా కనపడే రా-వన్ కూడా గందరగోళం చేసేస్తాడు. మణికంఠన్ కెమెరా, శిబుశిరిల్ కళ, నెహలాస్ విజువల్ ఎఫెక్ట్స్ గూర్చి ఎంత చెప్పుకొన్నా తక్కువే. విశాల్ - శేఖర్ ద్వయం సమకూర్చిన సంగీతం కర్ణప్రేయంగా లేదు.

చిత్ర సమీక్ష

చిత్రకథలోనికి వెళ్తే లండన్‌లో వుండే కంప్యూటర్ నిపుణుడు శేఖర్ సుబ్రహ్మణ్యం(షారూఖ్‌ఖాన్) పిల్లల కోసం అత్యద్భుత వీడియో గేమ్‌ను సాంకేతిక పరిజ్ఞానంతో సృష్టిస్తాడు. ఆయన కుమారుడు ప్రతీక్(అమన్‌వర్మ) కోరికమీదట అందులో విలన్‌ను శక్తివంతునిగా రూపకల్పన చేస్తాడు. అతనికి రా-వన్ అని పేరుపెడతాడు. మంచి లక్షణాలతో జీ-వన్‌ను సృష్టిస్తాడు. గేమ్ లాంచింగ్ సందర్భంగా అందరూ పార్టీలో ఉండగా ప్రతీక్ వెళ్లి రా-వన్‌తో గేమ్ ఆడడం మొదలు పెడుతాడు. రెండవ దశలో దాన్ని ప్రతీక్ ఆపేయడం ఇష్టంలేని రా-వన్ అతనిపై పగబట్టి కొన్ని సాంకేతిక అంశాల కలయికతో అద్భుతశక్తివంతుడై ల్యాబ్ నుంచి సమాజంలోకి వచ్చేస్తాడు. అతనికి చావుండదు. ఏ రూపంలోనికైనా వెళ్లిపోతుంటాడు. ప్రతీక్ ఎక్కడున్నాడో చెప్పమని శేఖర్‌ను నిలదీసే రా-వన్ అతన్ని నడిరోడ్డుపై చంపేస్తాడు. దీంతో శేఖర్ భార్య సోనియా(కరీనాకపూర్) ప్రతీక్‌తో సహా ఇండియా బయలుదేరగా వీళ్లను చంపను రా-వన్ వెనుకబడతాడు. ఈ సందర్భంగా ల్యాబ్‌లోని శేఖర్ సహాధ్యాయి జెన్ని (షెహనా గోస్వామి) జీ-వన్(షారూఖ్‌ఖాన్)ను ఉత్తేజితుడ్ని చేస్తుంది. అతను వెళ్లి రా-వన్‌ను నిలువరించి అతనిలోని అణువణువును రోడ్డురోలర్‌తో ధ్వంసంచేసి పైన రోడ్డువేసేలా చేస్తాడు. జీ-వన్ శేఖర్ కుటుంబీకులతో ఇండియా వచ్చేస్తాడు. జీ-వన్ శేఖర్ రూపురేఖలు కలిగి ఉండడంతో చుట్టుప్రక్కల వాళ్లంతా శేఖర్ - సోనియా జంటను చూసి ముచ్చటపడుతుంటారు. విచిత్ర రూపుడైన జీ-వన్ సోనియాను కొన్నిసార్లు ఆకర్షిస్తాడు. లండన్‌లో రోడ్డు దెబ్బతినడంతో రా-వన్ అణువులన్నీ కలసి మళ్లీ కొత్తగా అర్జున్ రాంపాల్ రూపంలోకి వస్తాడు. ఇండియా వచ్చి పది తలల రావణుడిలా పది రూపాల్లో ప్రతీక్‌ను అంతమొందించాలని చూడగా జీ-వన్ ఏవిధంగా అడ్డుకొంటాడన్నది వెండితెరపై చూడడమే ఉత్తమమేమో. ఎవర్ని ఆకట్టుకొన్నా, ఆకట్టుకోక పోయినా జీ-వన్ పిల్లల్ని మాత్రం విపరీతంగా ఆకర్షిస్తాడు.



విశ్వాసం మెండుగా... ముందుకు

చాలామంది సవాలక్ష అనుమానాలతో పని మొదలు పెడతారు. చివరికి ఫలితం కూడా అలాగే వుంటుంది. నేను మాత్రం ఏ పని మొదలెట్టినా అందులో వందశాతం విశ్వాసం వుంచుతానంటుంది హీరోయిన్ శ్రియ. తన వ్యక్తిగత జీవనశైలిని విశ్లేషిస్తూ చదువా? సినిమానా? ఈ విషయం మీద ఎప్పుడూ తర్జన భర్జనలు పడలేదు. నటిగా నిలదొక్కుకొంటానని మొదటిరోజే అనుకొన్నాను. ఈ సినిమా బాగా ఆడుతుందా? లేదా? అనవసరంగా ఒప్పుకొన్నానేమో అనే అనుమానం మధ్యలో ఎప్పుడూ రాలేదు. అలా వస్తే ఆ పనిని పూర్తి చేయలేం. చేసే పనిలో నమ్మకం వుంచాలి. అదే విజయాన్ని తీసుకొస్తుందని శ్రియ ధంకా భజాయించి మరీ చెబుతుంది.

ప్రణాళికతో ముందడుగు



జీవితంలో ఏదైనా సాధించాలంటే ప్రణాళిక వేసుకోవలసిందేనంటుంది హీరోయిన్ సమంత. అయితే తన జీవితంలో ఏదీ ప్లాన్ ప్రకారం జరగలేదంటుంది. అన్నీ అనుకోకుండా, యాదృచ్ఛికంగా జరిగిపోయినవే. అయినా అవన్నీ నా మంచికే అనుకొంటానంటుంది. తెలుగు పరిశ్రమలో కేవలం అదృష్టం వల్లే నేనీస్థానంలో వున్నాను. అయితే దీన్ని కాపాడుకోవడానికి ఎంతకష్టపడాలో నాకు తెలుసు. ఒక్క రోజులో భవిష్యత్తు తలకిందులవ్వొచ్చు. ఆ విషయం గుర్తెరిగి నడుచుకొంటాను. బాలీవుడ్‌కి వెళ్తానని కూడా అనుకోలేదు. అది దర్శకుడు గౌతమ్ మీనన్ వల్లే సాధ్యమయ్యింది. అక్కడ కూడా తన అదృష్టం పరీక్షించుకొంటానని చెబుతోంది.

సరస సంభాషణ... కళా పోషణే!



కాసింత నటన, ఇంకొంచెం ఘాటు సన్నివేశాలు, జీరోసైజ్ శరీరం... ఇవన్నీ చెప్పగానే కళ్లముందు కదలాడే రూపం కరీనా కపూర్. 'జబ్ వుయ్ మెట్' సినిమాలో బరువైన నాయికపాత్రని బహుబాగా పోషించి ఈతరం కథానాయికలకు ఆదర్శంగా నిలిచింది. ఈ అమ్మడిలో మరో కోణం కూడా వుంది. అదే కాస్త సెక్సీ సంభాషణల్ని అదే రీతిలో పలకడం. గోల్మాల్ లాంటి చిత్రంలో సరసమైన సంభాషణల్ని తనదైన శైలిలో పలికి కిక్ ఎక్కించింది. కొన్ని మాటల్ని సెక్సీగా హస్కీగా పలికి అందరిని ఆకట్టుకొంది. ప్రస్తుతం రా.వన్‌లోనూ ఇటువంటి సరస సంభాషణలు పలకడమే కాదు పంజాబీ ఆడపడుచుగా కొన్ని ఘాటైన సన్నివేశాల్లో కూడా నటించింది. సరస సంభాషణ కళాపోషణలో భాగమంటున్న కరీనాను మనమేం అనగలం.

దేనికైనా... సై!



తక్కువ రోజుల్లో ఎక్కువ పేరు సంపాదించడం ఎలా? హీరోయిన్ సోనమ్ కపూర్ ప్రస్తుతం ఈ దిశగానే ఆలోచిస్తుంది. ఆమె ఎంతో ఇష్టపడి చేసిన 'మౌసమ్' చిత్రం ప్రేక్షకుల మెప్పు పొందలేకపోయింది. దీంతో ఈ అమ్మడికి ఏం చేయాలో పాలుపోవడం లేదు. ఇప్పుడు హీరోయిన్ల రేసులో పరుగు తీయడం కాదు కనీసం నిలబడగలనా? అని తెగ ఆలోచిస్తుంది. సన్నిహితులేమో ప్రత్యేక గీతాల్లో నటించమంటున్నారట. ఈ ఆలోచన సోనమ్‌కు నచ్చింది. ఈ విషయాలపై మాట్లాడుతూ మౌసమ్ ఫలితానికి నేనేం నిరాశ చెందడం లేదు. ప్రస్తుతం కొత్త పాత్రల కోసం ఎదురుచూస్తున్నా. నన్ను కొత్తగా చూపించే ఎలాంటి పాత్ర అయినా నటించడానికి సిద్ధంగా వున్నాను. చివరికి అది ఐటమ్‌పాటైనా అంటుంది. మరి ఛాన్స్ ఇచ్చేవారిదే ఆలస్యం.

నాని క్లాస్ మాస్ సినిమాలు

దర్శకుడు సురేంద్రరెడ్డికి స్టైలిష్‌గా సినిమాలు తీస్తాడని పేరుంది. ఆయన సినిమాల్లో రివర్స్ స్క్రీన్‌ప్లే కూడా ఎక్కువ వుంటుంది. అశోక్, కిక్, ఊసరవెల్లి సినిమాలు ఈ తరహాలోనివే. ఇదే విషయాన్ని ఆయన్ను అడిగితే రివర్స్ స్క్రీన్‌ప్లే అని ఏం లేదు. కథను ఆసక్తిగా చెప్పడానికి అదో టెక్నిక్ మాత్రమే. కేవలం ఒక వర్గాన్ని తృప్తిపరచను సినిమాలు తీయలేం. క్లాస్‌మాస్ అందరూ చూడాలి. ఊసరవెల్లి సినిమానే తీసుకోండి. బి,సి సెంటర్లలో ఎంత ఆదరణ లభిస్తుందో ఏ సెంటర్లలో కూడా అదే ఆదరణ లభిస్తుందన్నారు. ఈ సినిమాను హిందీలో కూడా తానే తీస్తానని సురేంద్రరెడ్డి చెప్పాడు.

కుంచించుకపోతున్న రోడ్లు!



నెల్లూరు మండపాలవీధిలో రోడ్డును ఎలా దురాక్రమించారో చూడండి.

రోడ్లు, స్థలాలు ఆక్రమణచేసి ఎడాపెడా నిర్మాణాలు చేపట్టేవారి సంఖ్య అధికం అవుతోంది. విశాలంగా వుండే ప్రాంతాలతోపాటు ఇరుకు ఇరుకుగా ఉండే చోటా అక్రమార్కులు ఇష్టానుసారంగా భవనాలు నిర్మించేస్తుండడంతో రోడ్లు కుంచించుకు పోతున్నాయి. వాహనాల రాకపోకల సంగతి అటుంచితే చివరకు నడవడానికే కష్టతరంగా మారుతోంది. దీనికి ఉదాహరణ ఆచారివీధి, మండపాలవీధి ప్రాంతాలు. వ్యాపార కేంద్రాలైన ఇక్కడ అసలే రోడ్లు అంతంత మాత్రంగా వుంటాయి. అలాంటి చోట్ల కొందరు నిబంధనలు అతిక్రమించి భూరి భవంతులు నిర్మించేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో ఒకరిని చూసి మరొకరు రోడ్డును ఆక్రమించి భవన నిర్మాణాలు చేపడుతున్నారు. ఆచారివీధి, పణతులవారివీధిలో వస్త్ర దుకాణాలు అధికంగా వుంటాయి. మండపాలవీధి, చిన్నబజారు బంగారు అంగళ్లకు ప్రధాన కేంద్రాలు. నిత్యం జిల్లా నలుమూలల నుంచి కొనుగోలుదారులు ఈ ప్రాంతానికి వచ్చి వ్యాపార లావాదేవీలు నిర్వహిస్తుంటారు. నివాసాలు అధికంగా వుండే ఈ ప్రాంతంలో ఆక్రమణల కారణంగా 12 అడుగులు ఉండాల్సిన రోడ్లు కుంచించుకపోయి ఆరు అడుగులకు పరిమితం అయ్యాయి. వాహనాలను రోడ్డుపై నిలుపుతుండడంతో నిత్యం ట్రాఫిక్ జామ్. దీంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురౌతున్నారు. దీనికితోడు ఆచారివీధి, మండపాలవీధి, పణతులవారివీధిలో జైన్ దేవాలయం, రాఘవేంద్రస్వామి ఆలయం, మహాలక్ష్మి దేవాలయాలు ఉన్నాయి. ఈ ఆలయాల్లో భక్తుల తాకిడి అధికంగా వుంటోంది. షాపులకు, ఇతరత్రా పనులపై ఈ ప్రాంతాలకు రావాలంటేనే హడలి పోతున్నారు. అడుగుతీసి అడుగు పెట్టలేనంతగా ట్రాఫిక్ స్తంభించిపోతోంది. పారిశుద్ధ్య పరిస్థితి అధ్వాన్నంగా వుంది. ఇప్పటికైనా అధికారులు నిబంధనలకు అనుగుణంగా భవన నిర్మాణాలు జరిపేలా చూడాలని, పారిశుద్ధ్యాన్ని మెరుగు పరచాలని స్థానికులు కోరుకొంటున్నారు.

ముదనష్టపు సోకు చూడతరమా!


నెల్లూరు గిడ్డంగి వీధిలో రోడ్డుపై పేరుకొన్న చెత్తాచెదారం.

నాగరికతకు ఆనవాళ్లుగా పరిశుభ్రత, పారిశుద్ధ్యాన్ని కొలమానంగా పరిగణిస్తారు. కానీ సింహపురి నగరంతోపాటు పట్టణాలు, పల్లెల్లో ఆ ఛాయలే కన్పించడం లేదు. ఎక్కడ చూసినా చెత్తాచెదారం, పొంగి పొర్లుతున్న మురుగు నీరు, అస్తవ్యస్తంగా డ్రైనేజి, అపరిశుభ్ర వాతావరణంలో నగరాలు, పల్లెలు అపరిశుభ్రతకు కేరాఫ్ అడ్రస్‌గా మారుతున్నాయి. పారిశుద్ధ్య నిర్వహణపై పాలకులు, అధికారులకు శ్రద్ధ లేకపోవడంతో ప్రభుత్వం ఏటా కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నా పరిస్థితుల్లో మార్పు రావడం లేదు. పారిశుద్ధ్యం మెరుగుపడడం లేదు. పారిశుద్ధ్యం క్షీణించిన కారణంగా ప్రజలు రోగాల బారిన పడుతున్నా పట్టించుకొనే నాధుడే లేకుండా పోయాడు. ఈ విషయంలో పట్టణాలు, గ్రామాలు అన్న తేడా లేకుండా పోయింది. చెత్తను సక్రమంగా తొలగించక పోవడం, పర్యవేక్షణ లేకపోవడంతో నెల్లూరు నగరంతోపాటు కావలి, వెంకటగిరి, గూడూరు మునిసిపాలిటీలు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. రోజులతరబడి చెత్త తొలగించని కారణంగా దుర్గంధం వెదజల్లుతుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. డ్రైనేజి నిర్వహణకు సరైన ప్రణాళిక లేకపోవడంతో పట్టణాలతోపాటు మండల కేంద్రాల్లోనూ డ్రైనేజి అస్తవ్యస్తంగా వుంది. మునిసిపాలిటీల్లో కాలువల్లో పేరుకుపోయిన పూడికను ఎప్పటికప్పుడు తొలగించని కారణంగా మురుగునీరు పొంగి రోడ్లపై పారుతుండడంతో నడవడానికి కష్టంగా వుంటోంది. రోడ్లు దెబ్బతిని వుండడంతో ఆ గుంటల్లో నీరు నిలిచి ప్రమాదాలకు కారణమౌతున్నాయి. మరోవైపు దోమల నిర్మూలనకు ఫాగింగ్ చేయడం, నీళ్లలో ఆయిల్ బాల్స్ వేయడం, గంబూసియా చేపలను వదలడం లాంటి చర్యలకు అధికారులు ఎప్పుడో మంగళం పాడడంతో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. దీంతో ప్రజలు అనారోగ్యం పాలౌతున్నారు.

With a heavy heart
we announce the sad demise of

Our Chairman

Mr. P. RADHAKRISHNA REDDY



Deeply mourned by Nelcast Family

NELCAST LIMITED

16.01.1955 - 03.11.2011

Note : Cremation will be on 5-11-2011, 10-30 a.m. at NELLORE, Residence No. 24/398, Dargamitta.

రాత్రికి రాత్రే మారిపోతుంది

11వ పేజీ కొరవ

కొంత భాగాన్ని దేశంలోకి తెచ్చుకొన్నారు. మారిషస్, షెషెల్స్ వంటి దేశాల ద్వారా మన షేర్ మార్కెట్‌లోనూ, కార్పొరేట్ రంగంలో ప్రైవేట్ ఈక్విటీ పెట్టుబడుల ద్వారాను ఇటీవల సంవత్సరాలలో తరలి వచ్చిన వేలాది కోట్ల రూపాయల సొమ్ములో కొంత స్విస్ బ్యాంకుల నుంచి వచ్చిందే అని చెప్తున్నారు. ఆ బ్యాంకులో వృధాగా పెట్టే కంటే, ఇక్కడ రాబడి అధికం కావడం వీరిలో మార్పుకు కారణం.

దేశంలోనూ ఎంతో నల్లధనం

అయితే నల్లధనం మొత్తం విదేశాలలో దాగి వుందని భావించడం పొరపాటు. అక్కడ వున్న దానికి కనీసం పదిరెట్లు దేశంలోనే మూలుగుతున్నది. ఇటీవల కాలంలో రియల్ ఎస్టేట్ రంగంలో భూముల ధరలు ఆకాశానికి ఎగబ్రాకడం ఈ నల్లధనం మహిమే అని ఎవరైనా ఒప్పుకొని తీరాలి. బొంబాయి నగరం నుంచి బుచ్చిరెడ్డిపాళెం వంటి గ్రామాల వరకు ఎవరి స్థాయిలో వారు తమ నల్లధనం మొత్తాన్ని భూముల రూపంలో బదలీ చేసుకొన్నారు. దాని వల్లనే వాటి ధరలు అనూహితంగా పెరిగిపోయాయి. పంచాయితీ సర్పంచ్ నుంచి ప్రధాన మంత్రి స్థాయి వరకు రాజకీయ వాదుల వద్ద, ప్రభుత్వ అధికారుల వద్ద ఇప్పటికీ కొన్ని లక్షల కోట్ల రూపాయల నల్లధనం పోగుపడి వుందని అందరికీ తెలుసు. కానీ దాన్ని బయట తీయడం ఎట్లానో ఎవరికీ అర్థం కావడం లేదు.

కిరణ్ సర్కారుకు చంద్ర రక్ష

మొదటి పేజీ కొరవ

మంది ఎమ్మెల్యేలు వున్నారు. ఈ అవకాశాన్ని వాడుకొని ఆయన అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడితే, జగన్ వర్గం ఎమ్మెల్యేలు, టిఆర్ఎస్ వంటి పార్టీలు దానికి అనుకూలంగా ఓటు చేస్తే, ప్రభుత్వం పడిపోతుంది. అయితే చంద్రబాబు అంత త్వరపడి అవిశ్వాసం పెట్టే ఆలోచనలో లేదు. ఈ దశలో ప్రభుత్వం కూలడం వల్ల తనకు రాజకీయ నష్టమే తప్ప లాభం లేదన్నది ఆయన ఆలోచన. ప్రభుత్వం కూలి ఎన్నికలు వస్తే, జగన్‌కు అనుకూలమౌతుందన్నది భయం. మరొక ఏడాదిపాటు ఇట్లనే నడిస్తే, సిబిఐ కేసులలో జగన్ జైలుకు వెళ్లి, ఆయన పట్ల జనంలో వ్యతిరేకత పెరిగి పెద్దదౌతుందని, అప్పటి వరకు ప్రభుత్వాన్ని కాపాడడమే మేలని చంద్రబాబు ఆలోచిస్తున్నట్లు తెలుస్తున్నది. ఒకరకంగా చెప్పాలంటే కిరణ్ సర్కారుకు చంద్ర రక్ష లభించబోతున్నది.

అయితే జగన్‌కు ప్రభుత్వాన్ని కూలగొట్టే అవకాశం వుంది. ఆయన పక్షంగా రాజీనామాలు చేసిన 26 మంది మాట మీద నిలబడే వారైతే. నేరుగా గవర్నర్ వద్దకు వెళ్లి తమ మద్దతు ఉప సంహరిస్తున్నట్లు లేఖ వ్రాసి ఇస్తే, విశ్వాస తీర్మానం పెట్టక తప్పదు. అయితే జగన్‌కు కిరణ్ సర్కారు మీద ఎంత కక్ష వుందో. ఆయన వర్గం ఎమ్మెల్యేలకు ప్రభుత్వాన్ని నిలపాలన్న కోరిక అంతే బలంగా వుంది. రెండున్నరేళ్ల ముందుగా పదవులు వదలుకోవడానికి వారు సిద్ధంగా లేరు. అందువల్లే ఒక పక్క రాజీనామాలిచ్చి జగన్‌ను సంతృప్తి పరుస్తున్నారు. మరొకపక్క వాటిని ఆమోదించవద్దని స్పీకర్‌ను వేడుకొని కిరణ్ మెప్పు పొందుతున్నారు. నిజం చెప్పాలంటే దొంగ నాటకం ఆడుతున్నారు. అందువల్ల చంద్ర రక్ష దొరకకపోయినా జగన్ కక్ష తనేమీ చేయదన్న ధీమాతో వున్నాడు ముఖ్యమంత్రి.

జగన్, కెసిఆర్‌లు చంద్రబాబు మీద ఒత్తిడి పెంచుతున్నారు. అవిశ్వాసం పెట్టకుండా కాంగ్రెస్ సర్కారును కాపాడుతున్నాడని జనంలో ఆగం చేసి, తెలుగుదేశం పార్టీని గబ్బు పట్టిస్తున్నారు. ఒకవేళ ఈ ఒత్తిడి తట్టుకోలేక చంద్రబాబు అవిశ్వాసానికి సిద్ధపడినా, ప్రభుత్వాన్ని వేరొక రూపంలో కాపాడేదుకు ఆలోచన చేస్తున్నాడని వినికిడి. అందుకున్న మార్గం రాజీనామాలు.

ఇప్పటి వరకు జగన్ వర్గం నుంచి కాంగ్రెస్ వాదులు 26 మంది, తెలుగుదేశం వాదులు ఇద్దరు, టిఆర్ఎస్ నుంచి 12 మంది నాగం జనార్దనరెడ్డి వర్గీయులు ముగ్గురు, జూపల్లి కృష్ణారావు వర్గీయులు ముగ్గురు కలిసి, మొత్తం 46 మంది రాజీనామాలు స్పీకర్ వద్ద పెండింగ్‌లో వున్నాయి. వాటిని ఆమోదించకుండా కాలం వెళ్లదీస్తున్నాడు నాదెండ్ల మనోహర్. అయితే అవిశ్వాసం తప్పని పరిస్థితి ఏర్పడితే, వీరందరి రాజీనామాలు ఒక్క కలం పోటుతో ఆమోదించాలని ప్రతిపాదన వినవస్తున్నది. అప్పుడు శాసన సభలో మొత్తం బలం 247కి పడిపోయి, కేవలం 124 మందితో ప్రభుత్వం గట్టెక్కుతుంది. అంత బలం కిరణ్‌కు వుంది కాబట్టి, అవిశ్వాసం వీగిపోతుంది. ఒకవేళ అది కూడా ప్రమాదమనిపిస్తే, చివరి నిముషంలో ఇరవైమంది వరకు తెలుగుదేశం తెలంగాణ వాదుల చేత రాజీనామాలు చేయించే ప్రతిపాదన వుంది. అదే జరిగితే, కిరణ్‌కు వంద మంది ఎమ్మెల్యేలు చాలు, ప్రభుత్వాన్ని నిలుపుకోవడానికి.

ఏది ఏమైనా కిరణ్ సర్కారుకు విశ్వాస, అవిశ్వాస తీర్మానాల బెడద ప్రస్తుతానికి లేదనే పరిశీలకుల అంచనా.

నెల్లూరు ముచ్చట్లు

3వ పేజీ కొరవ

మణి మండల ఉపాధ్యక్షురాలుగా పని చేస్తున్నారు. ఆయనకు ముగ్గురు కుమార్తెలు.

యరమాక ఆదిశేషారెడ్డి మృతి

చేయి తిరిగిన విమర్శకుడు యరమాక ఆదిశేషారెడ్డి(77) అక్టోబర్ 31వ తేది వావిళ్లలో మరణించారు. జమీన్‌రైతు, మందాకిని, యూత్ కాంగ్రెస్ పత్రికలలో కథలు, ప్రత్యేక వ్యాసాలు, కవితలు లెక్కలేనన్ని వ్రాశారు. జిల్లాలో ఎక్కడ అష్టావధానం జరిగినా అప్రస్తుత ప్రసంగం చేసే పృచ్ఛకునిగా యరమాక ఉండేవారు. భాగ్యరేఖలో సినిమా పాట కూడా వ్రాశారు. ఇంగ్లీషు డిక్షనరీలో ఏ పదానికి అర్థమైనా చూడకుండా ఠపీ మని చెప్పేవారు. ఎందువల్లనో ఆయన పెళ్లి చేసుకోలేదు.

ఆత్మీయులను కోల్పోయిన పై మూడు కుటుంబాలకు మా సానుభూతి..

జనవాణి

2వ పేజీ కొరవ

చెట్ల పెంపకాన్ని ఒక ఉద్యమంలా చేపట్టాలి. చెట్ల పెంపకానికి విద్యార్థులకు ప్రత్యేక మార్కులు ఇచ్చే చర్యలు చేపట్టమనవి.

ఎన్.రాంమోహన్‌రెడ్డి చెన్నై

రోడ్డును పాడు పెట్టింది చాలక

మళ్లీ అక్రమ కేసులా?



చిల్డ్రన్స్ పార్కు వద్ద రోడ్డుపై నిలిచిపోయిన వర్షపు నీటిని శ్రమదానంతో దారి మళ్లిస్తున్న వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ కార్యకర్తలు.

జాతీయ రహదారి నుంచి నెల్లూరు నగరంలోకి వచ్చే కీలక మార్గం చిన్న పిల్లల పార్కు రోడ్డు. రోజూ కొన్ని వేల వాహనాలు రాకపోకలు జరిపే దారి అది. దానికి రెండు పక్కల ఇటీవలి కాలంలో పెద్ద ఎత్తున అపార్ట్‌మెంట్ భవంతులు వెలిశాయి. దాదాపు ఇరవై వేల మంది నివశిస్తున్నారు ఆ రోడ్‌కు అటు ఇటు. అంత ప్రాధాన్యత వున్న దారిని పాడు పెట్టాడు ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి. రోడ్డు విస్తరణ పేరుతో తానే కాంట్రాక్ట్ పని తీసుకొన్నాడు. సగం పని చేసి, తతిమా రోడ్డును అడ్డంగా త్రవ్వి వదలి పెట్టేశాడు. టెండర్ కంటే అధికంగా దొంగ బిల్లులు వ్రాసుకోవడానికి అంచనా విలువలు పెంచి చూపించుకోవడానికి చేస్తున్న ప్రయత్నంలో భాగంగా పని నిలిపివేశాడు. దానితో రోడ్డంతా గుంటలు, కాలువల మయమైపోయింది. ఇప్పుడు కురుస్తున్న వానలకు అవన్నీ బావులుగా మారాయి. ఉన్న సమస్య చాలదన్నట్లు రోడ్డుకు రెండు ప్రక్కల థర్మల్ స్టేషన్ బూడిద గుట్టలుపోసి పెట్టాడు. దానితో ఆ రోడ్డున ప్రయాణించే వారికి ప్రత్యక్ష నరకం కన్పిస్తున్నది. ఎక్కడ కాలువేస్తే ఏ బావిలో పడి బుడుంగున మునిగి పోతామో అని భయం. రాత్రి పూట అయితే ఆ రోడ్ దాటేవరకు ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవలసిందే. జనం ఇన్ని ఇబ్బందులు పడుతున్నా మునిసిపల్ అధికారులు మౌనంగా చూస్తూ ఉండడంతప్ప ఏమీ చేయలేక పోయారు. సాక్షాత్తు ఎమ్మెల్యే దొరవారే కాంట్రాక్టర్ కావడంతో దానికి అడ్డంపోతే తమ ఉద్యోగాలు ఊడిపోతాయన్న భీతితో చూస్తూ ఉండి పోయారు.

వైఎస్ఆర్ కాంగ్రెస్ నాయకుడు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి జనం బాధలు చూడలేక రంగంలోకి దిగాడు. తమ పార్టీ కార్యకర్తలు రెండు మూడు వందల మందిని కూడగలుపుకొని స్వచ్ఛందంగా ఆ గుంటలు పూడ్చి తాత్కాలికంగా రోడ్డులో రాకపోకలకు వసతి కల్పించాడు. రోడ్డులో మడుగులు కట్టిఉన్న నీటిని తొలగించడానికి పక్కనుండే డ్రైనేజి కాలువలకు ఒకటి రెండు చోట్ల గండి కొట్టించాడు.

తన కాంట్రాక్ట్ అక్రమం ఇంతగా గబ్బుపట్టిపోవడం, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి దాన్ని జనానికి అర్థమయ్యేట్లు చేయడంతో వివేకానందరెడ్డికి చిర్రెత్తుకొని వచ్చింది. శ్రీధర్‌రెడ్డిని భయపెట్టడానికి డ్రైనేజి కాలువలు పగుల గొట్టడం ప్రభుత్వ ఆస్తులు విధ్వంస నేరం క్రిందకు వస్తుందనే సాకుతో శ్రీధర్ రెడ్డి మీద కేసులు పెట్టించాడు. అతడ్ని, అనుచరులను నాన్ బెయిలబుల్ సెక్షన్ల క్రింద అరెస్ట్‌చేసి, జైలుకు పంపమని పోలీసు మీద వత్తిడి తెచ్చాడు. అయితే శ్రీధర్‌రెడ్డి జనం మనిషి. ఆయన్ను అరెస్ట్ చేయబోతున్నారన్న వార్త పొక్కగానే వందలాది మంది గుమికూడారు.

అయితే అప్పటికీ వివేకానందరెడ్డి వదలి పెట్టలేదు. పోలీస్ మీద తీవ్ర వత్తిడి తెస్తున్నాడు శ్రీధర్‌రెడ్డిని ఎట్లైనా జైలుకు పంపించమని. ఏమిటీ దౌర్జన్యం? ప్రకృతి విపత్తు వచ్చినప్పుడు, దారికి ఇబ్బంది అయ్యే పరిస్థితులలో కాలువలకు గండ్లు కొట్టడం, చెట్లు నరికించడం సాధారణంగా జరిగే పని. ప్రజా ప్రతినిధిగా ఆ పని తాను చేయవలసిందిపోయి ప్రజలకు ఉపకారం చేసిన వారి మీద తప్పుడు కేసులు బనాయించి వేధించే దుష్టబుద్ధి వివేకానందరెడ్డికి ఎందుకులవడిందో అర్థం కావడం లేదు. అక్రమ సంపాదన, అధికార దుర్వినియోగాలను మరిగిన ఆయనకు అన్నీ ఇటువంటి తప్పుడు ఆలోచనలే వస్తున్నాయి. అయితే వివేకానందరెడ్డి చేసే తాటాకు చప్పుళ్లకు భయపడి పారిపోయే కుందేటి పిల్ల కాదు శ్రీధర్‌రెడ్డి. జనం కోసం తాను చేసిన పని తప్పని అధికారులు భావిస్తే, నిరభ్యంతరంగాజైలుకువెళ్తాననిప్రకటించాడు.నేరుగా మునిసిపల్ ఆఫీస్‌కే వెళ్లి నేను చేసింది తప్పెట్లా అవుతుందో చెప్పమని కమిషనర్‌ను నిలదీశాడు. పాపం కమిషనర్ ఏమీ చేస్తాడు ఆయన వివేకా చెప్పు క్రింద తేలు వంటి వాడు. తలెత్తి చూసి నిజాలు మాట్లాడే అవకాశం ఆయనకు దొరకదు. శ్రీధర్‌రెడ్డి ప్రశ్నలకు సమాధానం చెప్పలేక దోషి వలె తలదించుకొని ఊరకుండి పోయాడు.

ఏది ఏమైనా వివేకానందరెడ్డి ఆగడాలు రోజు రోజుకూ శృతిమించి పోతున్నాయి. ఏదో ఒక రోజు జనమే తిరగబడి చెప్పు దెబ్బలతో సత్కరిస్తే తప్ప ఆయనలో మార్పు వచ్చేట్లు లేదు.

దడ పుట్టించిన సిబిఐ తనిఖీలు!

గతవారంలో సిబిఐ అధికారులు ఆకస్మికంగా జిల్లాకు రావడంతో అధికారుల్లో అలజడి రేగింది. ఇనుపఖనిజం అక్రమ త్రవ్వకాలపై సిబిఐ అధికారులు విచారణ చేపట్టిన సంగతి తెలిసిందే. ఇప్పటికే అక్రమ త్రవ్వకాలు జరిపి కోట్ల రూపాయలు సంపాదించిన గాలిజనార్దన్‌రెడ్డి మరికొంతమందిని సిబిఐ అరెస్టు చేసి జైల్లో పెట్టింది. ఇనుప ఖనిజంను మన జిల్లాలోని కృష్ణపట్నం ఓడరేవు నుంచి విదేశాలకు ఎగుమతి చేశారు. కృష్ణపట్నం ఓడరేవు ప్రారంభ దశ నుంచి ఇప్పటి వరకు ఎంత ఇనుప ఖనిజం ఎగుమతి జరిగింది? ఇందుకు లభించిన అనుమతులు? కస్టమ్స్ అధికారులకు ఎంతపన్ను చెల్లించాలి? ఎంత చెల్లించారు? అన్న వివరాలను సమగ్రంగా పరిశీలించారు. అనంతపురం, బళ్లారి ప్రాంతాల నుంచి అధికంగా ఇనుప ఖనిజం కృష్ణపట్నం ఓడరేవుకు వాహనాల ద్వారా చేరవేశారు.

చేశారు. ఒక సందర్భంలో కస్టమ్స్ అధికారులను విచారించేందుకు అదుపులోకి తీసుకున్నారన్న ప్రచారం కూడా జరిగింది. అనంతరం సిబిఐ జె.డి లక్ష్మీనారాయణ ఎవరిని అదుపులోకి తీసుకోలేదని మీడియాతో చెప్పారు. ఓడరేవు నుంచి ఎగుమతి, దిగుమతి చేసుకోవాలంటే ముందుగా కస్టమ్స్ అధికారుల నుంచి అనుమతి తీసుకోవాల్సి వుంటుంది. దిగుమతి, ఎగుమతి చేసే సరుకులకు పన్నులు ఎంత చెల్లించాలన్నది వీరు నిర్ణయిస్తారు. పన్నులు చెల్లించిన తర్వాతనే పనులు చేపట్టాలి.

ప్రమాదాలపై కూడా దర్యాప్తు

ఇనుప ఖనిజాన్ని రవాణా చేసిన లారీల కారణంగా మన జిల్లాలో కొన్ని వందలమంది ప్రాణాలు కోల్పోవడం జరిగింది. కడపజిల్లా నుంచి ముత్తుకూరు వరకు రహదారులు సైతం దెబ్బతిన్నాయి. ఇనుప ఖనిజాన్ని గనుల నుంచి కృష్ణపట్నం పోర్టుకు తరలించే క్రమంలో ప్రమాదాలకు కారణమైన వాహనాలపై సంబంధిత పోలీస్‌స్టేషన్ల ఎస్.ఐలు ఎటువంటి చర్యలు తీసుకోకుండానే కేసుల్లేకుండా వదిలేశారన్న ఆరోపణలు వున్నాయి. మృతుల కుటుంబ సభ్యులకు ఎంతో కొంత నగదు ముట్టచెప్పి రాజీలు చేసేవారు. ఇనుపఖనిజం వాహనాల కారణంగా ఇప్పటివరకు ఎంతమంది మృత్యువాత పడ్డారు? ఎంత పరిహారం చెల్లించారు? ఎన్ని కేసులు నమోదు కాబడ్డాయి? ఎన్ని కేసులు మాఫీ చేశారన్న దానిపై కూడా సిబిఐ దర్యాప్తు మొదలు పెట్టింది.



కృష్ణపట్నం పోర్టు తనిఖీకి వెళ్తున్న సిబిఐ జాయింట్ డైరక్టర్ లక్ష్మీనారాయణ.

సిబిఐ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ బృందం రాకకు సంబంధించి జిల్లా ఎస్పీకి తప్ప ఇతరశాఖల అధికారులకు ఎలాంటి ముందస్తు సమాచారం అందించలేదు. హైదరాబాదు నుంచి రైల్లో వచ్చిన సిబిఐ అధికారులు కొద్దిసేపు పోలీసు అతిధి గృహంలో విశ్రాంతి తీసుకొని అనంతరం నేరుగా నెల్లూరులో కృష్ణపట్నం పోర్టుకు సంబంధించిన ఎగుమతులు, దిగుమతులు పరిశీలించే కస్టమ్స్ కార్యాలయానికి వెళ్లారు. అక్కడ నుంచి కృష్ణపట్నం ఓడరేవుకు బయలుదేరి వెళ్లారు. సిబిఐ అధికారులు వెళ్లేలోపల పోర్టు అధికారులు ఇనుప ఖనిజం ఎగుమతులకు సంబంధించిన పత్రాలు సిద్ధం చేసుకున్నారు. అన్ని పత్రాలను సమగ్రంగా పరిశీలన జరిపిన తర్వాత మళ్లీ నెల్లూరులోని కస్టమ్స్ కార్యాలయానికి వచ్చి పన్ను చెల్లింపుకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. సిబిఐ జరిపిన తనిఖీల్లో పన్నులు సక్రమంగా చెల్లించలేదన్న విషయాన్ని గుర్తించినట్లు సమాచారం.

ఎగుమతి చేసిన ఇనుప ఖనిజం, చెల్లించిన పన్నులకు కొంత వ్యత్యాసం వుండడంతో కస్టమ్స్ అధికారులు, సిబిఐ అధికారులు అడిగిన ప్రశ్నలకు సరైన సమాధానం చెప్పలేక పోయారు. నెల్లూరు నగరంలో వున్న కస్టమ్స్ ప్రత్యేక కార్యాలయానికి చేరుకుని కొన్ని రికార్డులు, పత్రాలను తనిఖీ చేసిన సిబిఐ బృందం జిల్లాకొచ్చి ఈ కేసులో సంబంధమున్న వివిధ శాఖల అధికారులను ప్రశ్నించే అవకాశం వుంది.

● విజయనగర సామ్రాజ్య చరిత్రకు అద్దం పట్టే

తెలుగు శాసనాలు!

విజయ నగర సామ్రాజ్య చరిత్రలో సుప్రసిద్ధుడు, తుళువ వంశాంబుధిసోముడూ అయిన శ్రీకృష్ణదేవరాయలు పట్టాభిషేకం చేసుకొని అయిదువందల సంవత్సరాలు గడిచిన సందర్భంగా తెలుగు, కన్నడ, ఇంగ్లీషులలో దాదాపు రెండు వందల పుస్తకాల వరకూ వచ్చాయి. ఒక్క తెలుగులోనే అరవై ఎనిమిది పుస్తకాలు వచ్చాయి. వాటిలో 'కండపుష్టి' గల్గిన నాలుగైదు పుస్తకాలను 'జమీన్‌రైతు' పాఠకులకు పరిచయం చేయాలన్నది నా ఉద్దేశం.

తెలుగులో విజయనగర శాసనాలు అందునా శ్రీకృష్ణదేవరాయల రాజ్యపరిపాలనా కాలం నాటివి నూటయాభైకి పైగా శాసనాలున్నాయి. వాటిలో ముఖ్యమైనవి 111 శాసనాలు. వాటిపై వచ్చిన శాసన సంపుటం "శ్రీకృష్ణదేవ రాయల తెలుగు శాసనాలు". ఈ పుస్తకాన్ని కీర్తిశేషులు బి.ఎన్.శాస్త్రి గారి శిష్యులు సర్వశ్రీ ఈమని శివనాగిరెడ్డి, దామరాజు సూర్యకుమార్, కుర్రా జితేంద్రబాబు సంకలనం చేశారు. లేపాక్షి ఫౌండేషన్, అనంతపురం వారు ప్రచురించారు. వివరాల్లోకి వెళితే ఈ శాసనాల సంఖ్య జిల్లాల వారీగా వుంది. కడప జిల్లా తెలుగు శాసనాలు 28, చిత్తూరు జిల్లా 19, ప్రకాశం 11, గుంటూరు 11, అనంతపురం 8, కర్నూలు 7, నెల్లూరు 6, కృష్ణాజిల్లా 5, తమిళనాడు 6, విశాఖ 3, మహబూబ్‌నగర్ 2, కర్నాటక 1, బీహారు 1. ఉదయగిరి, కొండవీడు క్రీశ 1513, క్రీశ 1515 ప్రాంతాల్లో కృష్ణరాయలు గజపతుల నుండి స్వాధీనం చేసుకొన్న సమయంలో వేసిన శాసనాల్లోని అంశాలు అల్లసాని పెద్దన మనుచరిత్ర, ముక్కు తిమ్మన పారిజాతాపహరణం, కృష్ణరాయల ఆముక్తమాల్యద కావ్యాలలో వివరించిన అంశాలకు సరిపోతున్నాయి. ఇందులో కొన్ని చారిత్రక అంశాలు 'డొమింగోఫేస్' ఫెర్నావర్ న్యూనిజ్, అల్బుకర్క్, బర్బోసా వివరించిన అంశాల్ని కూడా బలపరుస్తున్నాయి. కొన్ని చాటువులు కూడా రాయల జీవిత సంఘటనలకు ఆధారాలవుతున్నాయి.

ఉదయగిరి శాసనం!

ఈ శాసనాల వల్ల రాజకీయ, సామాజిక పరిస్థితులు తేటతెల్లమవుతున్నాయి. ఉదయగిరి దుర్గం శత్రు దుర్భేధ్యం. పద్దెనిమిది మాసాల తర్వాత గానీ క్రీశ 1514 జూన్ 9కి గానీ ఉదయగిరి స్వాధీనం కాలేదు. ఉదయగిరి గుట్టపై 'లక్ష్మమ్మ' గుడి ఎదురుగా వున్న శాసనంలో ఈ వివరం వుంది. అలా స్వాధీన పరచుకొన్న ఉదయగిరి దుర్గానికి అధిపతిగా రాయలు కోన వల్లభరాయునికి ఆధిపత్యానిచ్చాడట.

కొండవీటి విజయం!

కొండవీడును జయించినట్లు తిరుమల శ్రీవారి రెండో ప్రాకారం ఉత్తరం గోడ మీద శాసనం విశదపరుస్తున్నది.

ప్రముఖ శాసనాలు!

క్రీశ 1515 జూలై 25కు చెందిన శ్రీశైల శాసనం, క్రీశ 1515 డిసెంబరు 21 శుక్రవారానికి చెందిన అహోబిల శాసనం, క్రీశ 1517 జనవరి 14 బుధవారానికి చెందిన కంటి శాసనం, క్రీశ 1517 ఫిబ్రవరి 11 శ్రీరంగపట్నం శాసనం, క్రీశ 1516 మార్చి 29 శనివారం సింహాచలం శాసనం ముఖ్యమైనవి. ఆయా దేవాలయాలను ఆయా తేదీలలో దర్శించుకొన్నట్లు మనం భావించాలి.

తిప్పలూరు శాసనం!

క్రీశ 1527 ఆగష్టు 26 సోమవారానికి చెందిన కడప జిల్లా తిప్పలూరు శాసనానికి ఓ చారిత్రక ప్రసిద్ధత వుంది. ఈ గ్రామాన్ని రాయలు అష్టదిగ్గజ కవులకు అగ్రహారంగా ఇచ్చాడు. ఈ అగ్రహార దానం క్రీశ 1527కు పూర్వమే జరిగి ఉండాలి.

కోకటం దాన శాసనం!

క్రీశ 1518 ఏప్రెల్ 25 ఆదివారానికి చెందిన శాసనం, మరియు క్రీశ 1518 అక్టోబరు 14 శుక్రవారానికి చెందిన శాసనం అల్లసాని పెద్దన వేయించినవి. అక్కడ కోటీశ్వరస్వామికి దాన శాసనములివి.

అయితే ఇక్కడొక వివరణ ఇవ్వాలి. అల్లసాని పెద్దనకు కడప జిల్లా 'కోకటం' అగ్రహారం దానంగా ఇస్తే తమిళనాడులో ఓ అమర గ్రామాన్నిచ్చాడు శ్రీకృష్ణ దేవరాయలు. దీన్నిబట్టి అల్లసాని కవిమాత్రమే గాక అమరనాయకుడనే విషయం అర్థమవుతున్నది.

చరిత్రను 'తికమక' పెట్టే శాసనాలు!

కృష్ణదేవరాయల మరణాన్ని గురించి వివిధ వాదనలున్నప్పటికీ, అవేవీ స్థిరమైనవి కావు. ఆఖరకు పెనుగొండలో రాయలు అల్లుడు అళయరామరాయలు వేయించిన తామ్రశాసనం కూడా(క్రీశ 1524) నమ్మదగింది కాదు. ఈ శాసనం క్రీశ 1524లో రాయల మరణాన్ని ధృవపరుస్తున్నది. అయితే రాయలు 1529 అక్టోబరు మాసంలో మరణించినట్లు ఆధారాలున్నాయి.

శ్రీకృష్ణదేవరాయల తెలుగు శాసనాలు

రచయితలు : **ఈమని శివనాగిరెడ్డి, దామరాజు సూర్యకుమార్, కుర్రా జితేంద్రబాబు**
సమీక్షకుడు : **పాయసం సుబ్రహ్మణ్యం**
పేజీలు : **240** వెల : **140/-**

ప్రతులకు

లేపాక్షి ఫౌండేషన్ 572, పి.వి.సి కాలనీ
బళ్లారిరోడ్, అనంతపురం - 515004

ఆ విషయం అలా ఉంచితే!

ఈ శాసన సంపుటిలో క్రీశ 1530 మార్చి 28న శాసనం(శ్రీశైలంలో) ప్రకారం అవసరం చంద్రశేఖరయ్య అనే వ్యక్తికి శ్రీశైల క్షేత్రానికి ఆధిపత్యం ఇచ్చినందుకు రాయల పుణ్యానికిగాను "శ్రీకృష్ణదేవరాయలు రాజ్యం చేయుచుండగా అని శాసనంలో పేర్కొన్నాడు". కృష్ణరాయలు క్రీశ 1529 అక్టోబరు 17న రాజ్యం చేస్తూ ఉంటే అచ్యుత దేవరాయలు క్రీశ 1529 అక్టోబరు 21న శ్రీకాళహస్తిలో ఎలా పట్టాభిషిక్తుడయ్యాడనేది ప్రశ్న? ఇంతకంటే ఆశ్చర్యపరిచే శాసనం మరొకటున్నది. క్రీశ 1513 సెప్టెంబరు 15వ తేదీకి చెందిన కడప జిల్లా గుర్రంపాడు చెన్నకేశవాలయంలోని శాసనం. ఈ శాసనంలో కూడా శ్రీకృష్ణదేవరాయలు రాజ్యం చేయుచుండగా అని ప్రస్తావించబడింది. రాయల మరణం తర్వాత కూడా ఇలా కొన్ని శాసనాలున్నాయంటే మనకు ఆశ్చర్యం వేస్తుంది.

ఏదిఏమైనా ఈమని, దామరాజు, కుర్రా త్రయం కృషి సామాన్యమైనదేమీ కాదు. తెలుగు శాసనాల్ని సేకరించి ప్రచురించినందుకు, అమూల్యమైన గ్రంథాన్ని ఆంధ్రులకు, ముఖ్యంగా చరిత్ర అభిమానులకు అందించినందుకు వారు అభినందనీయులు.

Regn.No. : RN 1156 / 57 J/Nellore/008/09-11

స్వాగతం సుస్వాగతం





గౌ॥ శ్రీ నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి
రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు

శ్రీ సిటీలో మూడేళ్ల ప్రగతి సంబరాలను ఆవిష్కరించడానికి
విచ్చేయుచున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు
మాన్యశ్రీ నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి గారికి
మా హృదయపూర్వక స్వాగతం - సుస్వాగతం

తేది : 04-11-2011 సమయం : మ॥ 2గం॥
స్థలం : శ్రీ సిటీ బిజినెస్ సెంటర్

SRI CITY
An Integrated Business City

ప్రగతి సంబరాల్లో భాగంగా...

ఉత్పాదన మొదలు పెట్టిన 20 పరిశ్రమలకు ప్రారంభోత్సవం

KOBELCO | KOBELCO CRANES INDIA PVT. LTD. | VRV GROUP | ROCKWORTH OFFICE SYSTEMS FURNITURE | BFG INTERNATIONAL | Venture | Amphenol | TIL EXPORTS PVT. LTD. | Shan Solar PVT. LTD. | EURA | Nolato | Saakar dream achieved | SriPower | npp

☆ నిర్మాణదశలో ఉన్న 13 పరిశ్రమలకు...

ALSTOM Transport | DANIELI | LAVAZZA ITALY'S FAVOURITE COFFEE | Metal One | BERGEN PIPE SUPPORTS | ANDREW INDUSTRIES | PIOLAX | Premium Ingredients | PALS PLUSH | EVERTON | SUTURES INDIA PVT. LTD. | OMNI AUTO LTD. | Amar Houseware

☆ 10 పరిశ్రమలకు భూమి పూజతో శ్రీకారం

HunterDouglas | unicharm | NHK NHK SPRING CO.,LTD. | EagleBurgmann Rely on excellence | Aisan | KUSAKABE | IFMR Institute for Financial Management and Research | CBS Chennai Business School Learning for the real world | Mohan Mutha | Tattva Energy

☆ శ్రీసిటీకి చెందిన 10 సదుపాయాల కల్పనా విభాగాలకు శుభారంభం



Edited, Printed and Published by N. Dolendra Prasad. Ph: 091-861-2327354, Offset Printing at Zaminryot Press, Nellore. E-mail : jaminryot@yahoo.com